ప్రజాశక్తి

ఆదివారం 26 అక్టోబర్ 2025 8 పేజీలు

ఎన్‌టిఆర్ కృష్ణా






మొంథా పై అప్రమత్తం

● ముందస్తు చర్యలకు కలెక్టర్ల ఆదేశం ● 27 నుండి విద్యా సంస్థలకు సెలవు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా), విజయవాడ : కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాలకు 'మొంథా' తుపాను ముప్పు ముంచుకొస్తోంది. ఈ తుపాను రాష్ట్రంలో తీరం దాటే అవకాశం ఉండడంతో అమరావతి వాతావరణ శాఖ రెడ్ అలెర్ట్ జారీ చేసింది. ఈనెల 26, 27, 28, 29 తేదీల్లో తుపాను ప్రభావం తీవ్రంగా ఉంటుందని హెచ్చరించింది. ఈ నెల 28న సాయంత్రం కాకినాడ సమీపంలో తీవ్రమైన తుపానుగా తీరం దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఆ సమయంలో గంటకు 90 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని చెబుతున్నారు. దూర ప్రాంతాలకు వెళ్లే వారు ప్రయాణాలు మానుకోవాలని సూచిస్తున్నారు. భారీ వర్షాలు కురవనుండటంతో కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సంసిద్ధం : కలెక్టర్లు

తుపాను హెచ్చరికల నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల కలెక్టర్లు డి.కె.బాలాజీ, డాక్టర్ జి.లక్ష్మీశ ఆదేశించారు. మచిలీపట్నం, విజయవాడల్లోని కలెక్టరేట్లో ఆయా జిల్లా అధికారులతో వేర్వేరుగా నిర్వహించిన సమావేశాల్లో వారు మాట్లాడుతూ తుపాను నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మచిలీపట్నం, విజయవాడల్లో 08672 252572, 91549 70454 నెంబర్లతో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. డివిజన్ స్థాయిలో ఆర్‌డిఒలు, మండలాల్లో తహశీల్దార్లు ఇన్సిడెంట్ కమాండర్లుగా వ్యవహరించాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు మండలాల్లో ఉండి పనులు పర్యవేక్షించాలన్నారు. లోతట్టు ప్రాంతా లపై ప్రత్యేకంగా దష్టిసారించి.. అవసరం మేరకు పునరావాస శిబిరాలను ఏర్పాటుచేయాలన్నారు. సమావేశాల్లో కృష్ణాజిల్లా జెసి ఎం.నవీన్, డిప్యూటీ కలెక్టర్ ఫర్వీన్ జాహిద్, డిఆర్‌ఒ చంద్రశేఖర రావు, అదనపు ఎస్‌పిలు వి.వి.నాయుడు, సత్యనారాయణ పాల్గొన్నారు.



విద్యా సంస్థలకు సెలవులు

తుపాను నేపథ్యంలో ఈనెల 27, 28, 29 తేదీల్లో కష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల్లోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలకు కలెక్టర్లు డి.కె.బాలాజీ, డాక్టర్ జి.లక్ష్మీశ సెలవులు ప్రకటించారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని సాంఘిక సంక్షేమ, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ సంక్షేమ వసతి గహాల్లో చదువుతున్న విద్యార్థులందరూ ఈనెల 26వ తేదీ సాయంత్రంలోగా వారి ఇళ్లకు వెళ్లేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ ఆదేశాలు క్షేత్ర స్థాయిలో సక్రమంగా అమలయ్యేలా జిల్లా విద్యాశాఖాధికారి, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ సంక్షేమ శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు.

27న వినగడప బ్రిడ్జి నిర్మించాలని బైక్ ర్యాలీ

ప్రజాశక్తి - గంపలగూడెం : వినగడప – కట్టలేరుపై నూతన హైలెవెల్ బ్రిడ్జి నిర్మించాలని కోరుతూ ఈనెల 27న తిరువూరు ఆర్డీవో కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి మద్దిరెడ్డి వెంకటరెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తోటమూలలోని సిపిఎం కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆరోజు ఉదయం 8 గంటలకు వినగడప – కట్టలేరు బ్రిడ్జి వద్ద నుంచి తిరువూరు ఆర్‌డిఒ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈర్యాలీలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబురావు, జిల్లా కార్యదర్శి డివి.కృష్ణ తదితరులు పాల్గొంటారని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ప్రజలు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మీడియా సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గువ్వల సీతారామిరెడ్డి, మండల కమిటీ సభ్యులు జానపాటి వెంకటేశ్వరరావు, మీసాల గోపి, బుడ్డం మారేశ్వరావు, బండి వీరబాబు పాల్గొన్నారు.

చిన్న చిన్న గొడవలు సహజం

● ఎంపి చిన్ని, ఎంఎల్ఎ కొలికపూడి వ్యవహారంపై మంత్రి కొల్లు
● స్థానిక సంస్థల ఎన్నికలపై కూటమి ప్రజాప్రతినిధులు, నేతల భేటీ

విజయవాడ : కుటుంబంలో వచ్చినట్లే పార్టీలోనూ చిన్నచిన్న గొడవలు రావడం సహజమనిమంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాకు చెందిన టిడిపి కూటమి ప్రజాప్రతినిధులు, నేతల సమన్వయ కమిటీ సమావేశం శనివారం విజయవాడలోని ఆర్ అండ్ బి గెస్ట్‌హౌస్‌లో జరిగింది. స్థానిక సంస్థల ఎన్నికలు అజెండాగా నిర్వహించిన సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ తిరువూరు విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు చూసుకుంటారని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల వ్యూహాన్ని కూటమి నేతలు ఇప్పటి నుంచే సిద్ధం చేసుకోవాలని సూచించారు. నియోజకవర్గాల సమస్యలపై త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలవాలని నిర్ణయించినట్లు తెలిపారు. మాజీ మంత్రులు పేర్ని నాని, జోగి రమేష్ చేస్తున్న విమర్శలను కూటమి శ్రేణులు గట్టిగా తిప్పి (మిగతా 2లో)



ఆర్ అండ్ బి గెస్ట్‌హౌస్‌లో భేటీ అయిన కూటమి ప్రజాప్రతినిధులు, జిల్లా స్థాయి నేతలు

మరింత ముదిరిన వ్యవహారం

చిన్ని బాధితుల సమావేశానికి వెళ్లాలని కొలికపూడి నిర్ణయం ?

ప్రజాశక్తి - తిరువూరు : టిడిపికి చెందిన విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని), తిరువూరు శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు మధ్య విభేదాలు మరింత ముదిరాయి. వీరి వ్యవహారంలో తాజాగా మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. నవంబరు 2వ తేదీన హైదరాబాద్‌లో జరిగే ఎంపి కేశినేని శివనాథ్ బాధితుల సమావేశానికి హాజరుకావాలని ఎంఎల్ఎ కొలికపూడి నిర్ణయించుకున్నట్లు తెలిసింది. దీంతో వీరి మధ్య విభేదాలు మరింతగా చర్చనీయాంశమవుతున్నాయి. ఇప్పటికే కేశినేని చిన్నిపై కొలికపూడి సంచలన ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా చిన్ని బాధితులతో సమావేశం కావాలని నిర్ణయించుకోవడంతో టిడిపిలో దుమారం రేపుతోంది. ఈ నేపథ్యంలో శనివారం జరిగిన కూటమి నేతల భేటీకి ఎంఎల్ఎ కొలికపూడి డుమ్మాకొట్టినట్లు తెలిసింది.

బ్యారేజీకి పెరిగిన వరద

ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో 84,094 క్యూసెక్కులు

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణా నదికి వరద ప్రవాహం క్రమంగా పెరుగుతోంది. శనివారం బ్యారేజీ ఎగువ ప్రాంతాలతోపాటు ఎన్టీఆర్ జిల్లాలో కురుస్తున్న వర్షాల కారణంగా కష్ణానదికి 84,094 క్యూసెక్కుల వరద ప్రవాహం కొనసాగుతోంది. దీంతో బ్యారేజీకి చెందిన 70 గేట్లలో 55 గేట్లను రెండడుగులు, 14 గేట్లను అడుగు మేర ఎత్తి 83,983 క్యూసెక్కుల వరద నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. ఒక గేటు సాంకేతిక కారణాలరీత్యా ఉపయోగించలేదు. అలాగే కృష్ణా తూర్పు ప్రధాన కాల్వకు 511 క్యూసెక్కుల నీటిని సాగు, తాగు నీటి అవసరాల నిమిత్తం విడుదల చేస్తున్నట్లు ఇరిగేషన్ శాఖ అధికారులు వెల్లడించారు. కృష్ణా పశ్చిమ ప్రధాన కాల్వకు నీటి విడుదల నిలిపివేసినట్లు తెలిపారు. ఇక ప్రకాశం బ్యారేజీ వద్ద పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 12 అడుగులు కాగా, ప్రస్తుతం 11.3 అడుగుల మేర నీటిమట్టం కొనసాగుతోందని ఇరిగేషన్ అధికారులు వెల్లడించారు.



ఆర్‌టిసి బస్సులో పొగలు



నందిగామ వద్ద పొగలు వ్యాపించిన బస్సు

వార్త మెయిన్‌లో

రాజధానిలో వేగంగా భవనాల నిర్మాణం

తుది మెరుగుల్లో ఉన్నతాధికారుల బంగ్లాలు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

రాజధాని అమరావతిలో పలు నిర్మాణాలు వేగం పుంజుకుంటున్నాయి. ప్రధానంగా ఆల్ ఇండియా సర్వీస్ అధికారుల కోసం అమరావతిలో 115 బంగ్లాల నిర్మాణ పనులు అత్యంత వేగంగా జరుగుతున్నాయి. ఎన్12 రోడ్డుకు సమీపంలో ఈ భవన నిర్మాణాలను కెఎంవి కంపెనీ తుది మెరుగులు దిద్దుతోంది. దాదాపు రూ.430 కోట్లతో గ్రౌండ్ ఫ్లోర్, ఒక అంతస్తుతో కలిపి 115 బంగ్లాను నిర్మిస్తున్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితోపాటు ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కమిషనర్లు, డైరక్టర్లతో కలిపి మొత్తం 115 బంగ్లాలు ఉండనున్నాయి. వీటిల్లో 25 చీఫ్ సెక్రటరీ కేడర్‌లో ఉన్న వారికి,. మిగిలిన వారు ముఖ్య కార్యదర్శులు, కమిషనర్లు ఉంటారు. లైట్ వెయిట్ సిమెంట్స్ బ్రిక్సుతో నిర్మాణాలుచేపట్టారు. వీటిల్లో ఒక భవనాన్ని ఇప్పటికే పూర్తి చేసి మోడల్‌గా చూపుతున్నారు. వీటిని పరిశీలించిన తరువాత కొన్ని మార్పులకు అవకాశం ఉంటుందని చెబుతున్నారు.
వీటితో పాటు ఎమ్మెల్యేల క్వార్టర్లు, ఉద్యోగుల క్వార్టర్లను సిద్ధం చేస్తున్నారు. గత నాలుగునెలల కాలంలో ఈ పనులకు వర్షాలు తీవ్ర ఆటంకంగా మారాయి. అయితే వచ్చే నెల నుంచి జూన్‌లోగా ఈ నిర్మాణాలను పూర్తి చేయాలని సిఆర్‌డిఏ అధికారులు కాంట్రాక్టు సంస్థలపై వత్తిడి తెస్తున్నారు. మరో వైపు రాయపాడి వద్ద ఐదు ఐకానిక్ టవర్ల నిర్మాణంకూడా తిరిగి వేగం పుంజుకుంటోంది. ఏడేళ్ల క్రితం శంకుస్థాపన చేసినా పునాదులన్నీ నీటిలోనే ఉండిపోయాయి. పునాదుల నాణ్యతపై చెన్నై నుంచి ఐఐటి నిపుణుల బృందం గత ఏడాది అమరావతికి వచ్చి పరిశీలించి పునాదులు ధృఢంగానే ఉన్నాయని, నిర్మాణాలు కొనసాగించవచ్చునని తెలిపింది. ప్రధానంగా ఐదు ఐకానిక్ టవర్లలో 40 అంతస్తుల పరిధిలో నాలుగు, 50 అంతస్తుల టవర్ ఒకటి నిర్మాణం చేపట్టనున్నట్టు అధికారులు తెలిపారు. మూడు టవర్లను ఎల్‌అండ్‌టి, రెండు టవర్లను షాపోర్‌జి, పల్లోంజి సంస్థ నిర్మిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న అమరావతి ఐకానిక్ భవనాలు ప్రత్యేకతను చాటుకుంటున్నాయి. అత్యంత ఆధునిక టెక్నాలజీతో నిర్మిస్తున్నారు. 2019కి ముందు చేపట్టిన ఈ టవర్లు ఐదేళ్లపాటు పునరాదులకే పరిమితం అయ్యాయి. టిడిపి ప్రభుత్వ ప్రభుత్వ హయాంలో సింగపూర్‌కు చెందిన పోస్టర్స్ అండ్ పార్ట్నర్స్ డిజైన్ చేయబడిన ఈ ఐకానిక్ టవర్లు 2019 నుంచి 2024 వరకు నిర్మాణాలు నిలిచిపోయాయి. వివిధ శాఖల రాష్ట్ర స్థాయి కార్యాలయాల కోసం ఈ టవర్లను నిర్మిస్తున్నారు. దాదాపు రూ.4 వేల కోట్లతో ఈ నిర్మాణాలు చేపట్టారు. దాదాపు ఐదేళ్లపాటు పునాదులు నీటిలోనే ఉండిపోయాయి. అయినా వీటి నాణ్యత తగ్గలేదంటున్నారు. అయితే తాజాగా ఇక మీదట వరద వచ్చినా దెబ్బతినకుండా చర్యలు తీసుకుంటున్నారు.



పూర్తి అయిన భవనం

జిల్లా యంత్రాంగం చర్యలు భేష్

కేంద్ర ప్రభారీ అధికారి అశోక్‌బాబు

విజయవాడ : ఆకాంక్షిత బ్లాకుల కార్యక్రమం (అస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రాం) అమలవుతున్న పెనుగంచిప్రోలు, ఇబ్రహీంపట్నం మండలాల అభివద్ధికి జిల్లా యంత్రాంగం మంచి చర్యలు చేపట్టిందని కేంద్ర ప్రభారీ అధికారి నేలపట్ల అశోక్ బాబు ప్రశంసించారు. స్థానిక కలెక్టరేట్లోని శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో శనివారం జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అధ్యక్షతన జరిగిన ఆకాంక్షిత బ్లాకుల సమావేశంలో కేంద్ర ప్రభారీ అధికారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జిల్లా యంత్రాంగం చేపట్టిన చర్యల వల్ల పెనుగంచిప్రోలు మండలంలో 25 సూచికల్లో, ఇబ్రహీంపట్నం మండలంలో 18 సూచికల్లో 100 శాతం లక్ష్యాన్ని సాధించినట్లు చెప్పారు. మిగిలిన సూచికల్లో కూడా సంతప్త స్థాయిని సాధించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ ఆకాంక్షిత బ్లాకులలో మెరుగైన ఫలితాల సాధనకు స్మార్ట్ వ్యవసాయాన్ని (స్మార్ట్ అగ్రికల్చర్) చేపడుతున్నామని చెప్పారు. అంతకుముందు కలెక్టరేట్‌లోని ఇగ్నైట్ సెల్‌లో డిఆర్డిఏ విభాగం ఏర్పాటుచేసిన స్టాల్‌ను అశోక్ బాబు... లక్ష్మీశతో కలిసి ప్రారంభించారు. వన్ గ్రామ్ గోల్డ్, మగ్గం వర్క్, పేపర్‌తో తయారుచేసిన బొమ్మలు, పచ్చళ్ళు, పౌడర్ల స్టాళ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మీ నరసింహం, ముఖ్య ప్రణాళిక అధికారి వై. శ్రీలత, జడ్పీ సీఈవో కేకే నాయుడు, కె.ఆర్.ఆర్.సి.స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పోసిబాబు, డిఎంహెచ్వో సుహాసిని, డిఆర్డిఏ పిడి నాంచారయ్య, విజయవాడ, నందిగామ ఆర్‌డిఒలు కె.చైతన్య, కె.బాలకష్ణ తదితరులు పాల్గొన్నారు.



విజిలెన్స్‌పై వాక్‌థాన్

విజయవాడ : విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా నగరంలో శనివారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన వాక్ థాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జోనల్ అధికారి సివిఎన్ భాస్కర్ రావు, ప్రాంతీయ అధికారి ఎం.వి.తిలక్, డిప్యూటీ జోనల్ అధికారులు, డిప్యూటీ రీజినల్ అధికారులు, విజిలెన్స్ అధికారి, బ్యాంక్ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈసందర్భంగా భాస్కర్ రావు మాట్లాడుతూ 'సత్యనిష్ఠతో జీవించండి – అవినీతి రహిత సమాజాన్ని నిర్మించండి' అనే సందేశాన్ని విస్తతంగా ప్రచారం చేస్తున్నామని చెప్పారు. తిలక్ మాట్లాడుతూ నైతిక విలువలు, నిజాయితీతో కూడిన వ్యవస్థ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు.

వైసిపి విభాగాలకు వర్కింగ్ ప్రెసిడెంట్ల నియామకం

విజయవాడ : ఎన్‌టిఆర్ జిల్లాకు చెందిన పలువురు వైసిపి నేతలు వివిధ విభాగాలకు వర్కింగ్ ప్రెసిడెంట్లుగా నియమితులయ్యారు. రాష్ట్రాన్ని ఐదు జోన్లుగా విభజించి, ప్రతి జోన్‌కు ఒక ప్రెసిడెంట్‌ను ఆ పార్టీ అధిష్టానం నియమించింది. వైసిపి ఎస్‌సి సెల్ జోన్ 3కి ఎన్‌టిఆర్ జిల్లాకు చెందిన నట్ట యోనారాజు నియమితులయ్యారు. పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా (జోన్ 3) ఎన్‌టిఆర్ జిల్లాకు చెందిన ఎ.రవిచంద్ర, ఎన్టీఆర్ జిల్లాకు చెందిన వి.ఈశ్వర్‌ప్రసాద్‌ను రాష్ట్ర వాణిజ్య విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ (జోన్ 3)గా నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది.

ఉద్యోగ నియామకాల పరీక్షకు హాల్‌టికెట్లు

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : డాక్టర్ ఎన్‌టిఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం మే15న ప్రచురించిన నోటిఫికేషన్ ఆధారంగా సిస్టం అడ్మినిస్ట్రేటర్, కంప్యూటర్ ఆపరేటర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగ నియామకాలకు సంబంధించి ఆన్లైన్లో అప్లై చేసిన అభ్యర్థులు తమ హాల్ టికెట్లను యూనివర్సిటీ వెబ్సైటు https://drntr.uhsap.in నుండి డౌన్లోడ్ చేసుకోవాలని యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాధికా రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 29,30 తేదీల్లో నిర్వహించే స్కిల్ టెస్టుకు అభ్యర్థులు హాల్ టికెట్లతో హాజరు కావాలని కోరారు.

ఘనంగా టివిరాజు జయంతి

విజయవాడ : సుప్రసిద్ధ సినీ సంగీత దర్శకులు టీవీ రాజు 105వ జయంతి సందర్భంగా "ఈనాటి ఈ హాయి.. కల కాదోయి నిజమోయి" సినీ సంగీత విభావరి శనివారం రాత్రి స్థానిక హనుమంతరాయ గ్రంథాలయంలో వీనులవిందుగా సాగింది. స్వరలయ, సాంస్కృతిక సేవా సంస్థ, విజయవాడ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ సంగీత విభావరిలో గాయనీ గాయకులు వై.ఎస్.రామకష్ణ (టీం లీడర్), కేవీబీ ఆనంద్, రవీంద్రనాథ్, రాజ్ కిషోర్, విష్ణుప్రియ, మల్లీశ్వరి, ఇందుశ్రీ తదితరులు పాడిన పాటలకు ప్రేక్షకులు పదేపదే కరతాళ ధ్వనులు చేశారు. ఎస్.వి.రమణమూర్తి, ఎస్సార్ ప్రభాకర్ నేతత్వంలో సాగిన ఈ కార్యక్రమానికి పి. మోహన్ రాంప్రసాద్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.



అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి - విజయవాడ : నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు అగ్ని ప్రమాదాలను నిరోధించడానికి శనివారం ఉదయం సూర్యారావు పేటలో ఉన్న గౌతమ్ డయాబెటిక్ హాస్పిటల్, అజిత్ సింగ్‌నగర్‌లోని సెయింట్ ఆన్స్ హాస్పిటల్‌ను విఎంసి సిబ్బంది ఆకస్మికంగా తనఖీ చేశారు. అగ్ని ప్రమాదం జరగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన నిరోధక చర్యలు, అగ్ని ప్రమాద నిరోధక పరికరాలను ఉపయోగించే విధానం, అగ్ని ప్రమాదం జరిగినప్పుడు మంటలను ఎలా ఆర్పాలి, ఎటువంటి పరికరాలను ఉపయోగించాలి, ఫైర్ స్ప్రింక్లర్స్, స్మోక్ డిటెక్టర్స్, ఎక్కడెక్కడ అమర్చాలి, వాటి వలన స్మోక్ అలారం ఎలా వస్తుంది, అగ్ని ప్రమాదం జరగకుండా కాంప్లెక్స్ చుట్టూ ఫైర్ సేఫ్టీ మెజర్స్ ఏమేం ఉండాలి వంటి విషయాలపై వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ మల్యాద్రి, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ కె. నరేష్ పాల్గొన్నారు.





వీనుల విందుగా కర్నాటక శాస్త్రీయ గాత్ర కచేరీ

విజయవాడ : సిద్ధార్థ అకాడమీ స్వర్ణోత్సవ సంవత్సర విశిష్ట కార్యక్రమంగా శనివారం రాత్రి ఆ అకాడమీ ఆడిటోరియంలో జరిగిన 'కర్ణాటక శాస్త్రీయ గాత్ర కచేరి' సంప్రదాయ సంగీత ప్రియులకు వీనుల విందు చేసింది. సిద్ధార్థ అకాడమీ సాంస్కృతిక సంస్థ 'ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం' ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో దేశాదేశాల్లో లెక్కకు మించి కర్ణాటక సంగీత కచేరీలతో భారతీయ ఖ్యాతిని దశదిశలా చాటుతున్న ప్రఖ్యాత గాయక సోదరీమణులు రంజని – గాయత్రి ఆలపించిన పలు సంకీర్తనలకు ప్రేక్షకుల హర్షధ్వానాలతో ఆడిటోరియం ఉప్పొంగిపోయింది. అభంగ్‌లు, జావళీలు పరణితి సాధన చేసి గాత్ర రంగంలో అంతర్జాతీయ ప్రసిద్ధులైన సోదరీమణుల ఆలాపనలకు ప్రేక్షక లోకం జేజేలు పలికింది. దీక్షితార్ కతి 'శ్రీమహాగణపతిమ్'... కీర్తనతో ప్రారంభించి– త్యాగరాజ కతులు 'మీ నామముచే నా మది నిర్మలమైనది'.. 'మరి మరి నిన్నే మొరలిడ నీ మనసున దయ రాదు'.., భద్రాచల రామదాసు కీర్తన 'ఏమయ్యా రామా'... ఇత్యాది కతులను ఆ ద్వయం ఆలపిస్తుంటే ఒళ్లంతా చెవులు చేసుకుని పారవశ్యంతో ఆనందించడం మధురానుభూతి. వయొలిన్ పై డా. నిశాంత్ చంద్రన్, ఘటంపై శ్రీరామ్ కష్ణ, మదంగంపై మనోజ్ శివ సహకారం కచేరీ కార్యక్రమాన్ని మరింతగా పండించింది.

అలరించిన 'సుశీల్' విభావరి

విజయవాడ : తెలుగు సినిమాకు తొమ్మిది దశాబ్దాలు దాటిన సందర్భంగా రాష్ట్రంలోని వివిధ కళా రంగ సంస్థల ఆధ్వర్యంలో.. స్థానిక గాంధీనగర్ కౌతా పూర్ణానంద కళావేదికపై వారం రోజులపాటు నిర్వహించ తలపెట్టిన తెలుగు సినీ సంగీత ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు శనివారం రాత్రి నరసరావుపేటకు చెందిన సుశీల్ మీడియా ఎంటర్టైన్మెంట్ వారు 'సినీ గీతాల సంగీత విభావరి'తో ప్రేక్షకుల్ని అలరించారు. భారతి, రమణి, సుమలత, అబ్దుల్ ఖాదర్, బాబూరావు, శ్యాం ప్రసాద్ సహా పలువురు గాయనీ గాయకులు పలు సినీ మధుర గీతాలు ఆలపించి ప్రేక్షకుల్ని ఆనందింపజేశారు. కార్యక్రమానికి ఇస్మాయిల్ వ్యాఖ్యానం శోభ చేకూర్చింది. మీడియా పార్ట్నర్ (ట్రాక్): సూర్య ఆశిష్ స్టూడియోస్. చిట్టిబాబు, డేవిడ్ రాజు, పరుచూరి విజయలక్ష్మి, బి.వి. వీరభద్రరావు తదితరులు కార్యక్రమాన్ని సమన్వయపరిచారు



చిన్న చిన్న గొడవలు సహజం

(మొదటి పేజీ తరువాయి)

కొట్టాలన్నారు. ఈ సమవేశంలో ఎంపి కేశినేని శివనాథ్, టిడిపి ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షుడు, కెడిసిసిబి ఛైర్మన్ నెట్టెం రఘురామ్, టిడిపి కృష్ణాజిల్లా అధ్యక్షుడు, ఎపిఎస్ ఆర్‌టిసి ఛైర్మన్ కొనకళ్ల నారాయణ, ఎంఎల్‌ఎలు బోడే ప్రసాద్, యార్లగడ్డ వెంకట్రావు, వర్ల కుమార్ రాజా, వసంత కష్ణ ప్రసాద్, బోండా ఉమా మహేశ్వరరావు, శ్రీరాం రాజ గోపాల్ (తాతయ్య), కాగిత కష్ణ ప్రసాద్, మండలి బుద్ధ ప్రసాద్, బిజెపి ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, జనసేన ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను తదితరులు పాల్గొన్నారు.

యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : తాజా వాతావరణ పరిస్థితుల దష్ట్యా ఈనెల 28, 29, 30 తేదీలలో మొంథా తుఫాను ప్రభావం దృష్టిలో ఉంచుకొని మండలంలో అన్ని విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో మహమ్మద్ ఇమ్రాన్, తాసిల్దార్ లోకరాజు లు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల స్థాయి అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తుఫాను ప్రభావాన్ని తగ్గించడానికి, ప్రజల భద్రతను నిర్ధారించడానికి తీసుకోవలసిన ముందస్తు జాగ్రత్తలపై వివరించారు. ప్రతి శాఖ తమ తమ బాధ్యతల పరిధిలో తగిన చర్యలు తీసుకోవాలని, అవసరమైన సహాయక సిబ్బంది, వనరులు సిద్ధంగా ఉంచాలని కోరారు. ప్రత్యేకంగా విద్యుత్, ఆరోగ్యం, పంచాయతీ రాజ్, గ్రామాభివద్ధి, పోలీస్, అగ్నిమాపక, వ్యవసాయ శాఖలకు ముందస్తు జాగ్రత్త చర్యలపై దృష్టి సారించాలని సూచించారు. మండల ప్రజలు కూడా తుఫాను సమయంలో జాగ్రత్తగా ఉండాలని, అవసరమైనప్పుడు మాత్రమే బయటకు రావాలని, ప్రభుత్వ సూచనలను పాటించాలని తెలిపారు.**ప్రజాశక్తి- నందివాడ:** తుపాను దృష్ట్యా అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మండల స్థాయి అధికారులకు నందివాడ తహశీల్దార్ కార్యాలయంలో సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో తహశీల్దార్ ఎన్. గురుమూర్తి రెడ్డి, ఎంపీడీవో పి.మల్లేశ్వరిలు పాల్గొని మాట్లాడుతూ తుఫాన్ కారణంగా ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఎంఈఓ డేవిడ్ రత్నరాజు, వ్యవసాయశాఖ అధికారి ఎన్.భాను ప్రకాష్, ఐసిడిఎస్ సూపర్వైజర్ నాగ శిరీష పాల్గొన్నారు.**ప్రజాశక్తి-పమిడిముక్కల :** రాబోయే తుఫానును ఎదుర్కొనేందుకు గ్రామ పంచాయతీలో ప్రజలకు అవసరమైన సామాగ్రిని అందుబాటులో ఉంచాలని పమిడిముక్కల మండల అభివద్ధి అధికారి వీర్ల సీతారామరాజు అన్నారు. శనివారం మండలంలోని మండల అభివృద్ధి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గ్రామ సెక్రటరీలందరూ అందు బాటులో ఉండాలని, గ్రామాల్లో చెట్లు, విద్యుత్‌స్తంభాలు పడిపోతే సరిచేయడానికి ప్రోక్లైన్‌లను అందుబాటులో ఉంచాలన్నారు. అలాగే నిత్యవసర సరుకులు అందు బాటులో ఉండాలని, అన్ని చర్యలు తీసుకొని అప్రమత్తంగా ఉండాలన్నారు. **ప్రజాశక్తి-చల్లపల్లి :** తుఫాన్ దూసుకొస్తుందని వాతావరణ శాఖ హెచ్చరికలు నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని అన్ని శాఖల అధికారుల సమన్వయంతో అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ బి వనజాక్షి అధికారులకు సూచించారు. శనివారం విలేకర్లతో సమావేశంలో ఆమె మాట్లాడుతూ భారీ వర్షాలు, తుఫాను హెచ్చరికల నేపథ్యంలో గ్రామాల్లోని గ్రామ రెవెన్యూ అధికారులు, మెడికల్, విద్యుత్తు, పోలీసు, ఇతర శాఖల అధికారులతో మాట్లాడి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. పాడైన, శిథిలావస్థలో ఉన్న ఇళ్లల్లో ఉన్న ప్రజలు, పల్లపు ప్రాంతాల్లో ఉన్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. తుఫాను తీవ్రత తగ్గే వరకు రైతులు ఎవరూ పంటలు కోతలు కోయకుండా చూడాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులు, సిబ్బంది పై చర్యలు తప్పవని హెచ్చరించారు. మండల పరిషత్ కార్యాలయంలో 24 గంటలు అందుబాటులో ఉండేలా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. 9908664610, 9913424202 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.



గుడ్లవల్లేరులో మాట్లాడుతున్న అధికారులు



గుడివాడలో మాట్లాడుతున్న ఎంపిడివో విష్ణుప్రసాద్

ప్రజాశక్తి - గుడివాడ : మంథా తుఫాన్‌పై అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని గుడివాడ డివిజనల్ డెవలప్మెంట్ అధికారిణి (డిఎల్‌డిఓ) సునితా శర్మ తెలిపారు. శనివారం స్థానిక ఎంపిడివో కార్యాలయంలో గుడివాడ డిఎల్‌డిఓ సునితా శర్మ అధ్యక్షతన మండల పరిధిలోని అన్ని శాఖాధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపిడివో విష్ణుప్రసాద్, తహసీల్దారు, కిరణ్, ఇతర మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శిలతో డిఎల్‌డివో సునీతా శర్మ మాట్లాడుతూ తాజా వాతావరణ పరిస్థితుల దష్ట్యా మంథా తుఫాను ప్రభావం దష్టిలో ఉంచుకొని మండలంలో అన్ని విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచనలు ఇచ్చారు. ప్రజలు కూడా తుఫాను సమయంలో జాగ్రత్తగా ఉండాలని, అవసరమైనప్పుడు మాత్రమే బయటకు రావాలని విజ్ఞప్తి చేశారు.

పాముకాటుతో రైతు మృతి



ప్రజాశక్తి-ఉంగుటూరు (గన్నవరం) : గన్నవరం మండలం గొల్లనపల్లి గ్రామానికి చెందిన రైతు బొబ్బ సీతా రామయ్య(82) శనివారం ఉదయం పాముకాటుకు గురయ్యి మృతి చెందాడు. ఉదయం 6 గంటల సమయంలో ఆయన తన పంట పొలాన్ని పరిశీలించడానికి వెళ్లడంతో ఈ సంఘటన జరిగింది. పాము కాటు వేయడంతో, విషయం తెలిసిన కుటుంబ సభ్యులు మరియు గ్రామస్తులు ఆయనను హుటాహుటిగా పిన్నమనేని సిద్ధార్థ హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందారు. మృతుడికి ఆయనకు భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. ఈ సంఘటనపై గన్నవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



నివాసాల మధ్య వర్షపు నీటితో ఇబ్బందులు

ప్రజాశక్తి-చల్లపల్లి : బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం కారణంగా కురుస్తున్న వర్షాలకు చల్లపల్లి నారాయణ రావు నగర్ లోని పల్లపు ప్రాంతాలలో అవాసాల మధ్య నీరు నిల్వ ఉండటంతో ఆ ప్రాంతవాసులు ఇబ్బందులు పడుతు న్నారు. ఇళ్ల నుండి బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. దోమలు ఉద్యోగం పెంచడంతో అనారోగ్యం ఫాలో అవుతామని ఆ ప్రాంత వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పగటిపూట ఈగల మోతతో, రాత్రులు దోమల కాటుతో బాధపడుతున్నామని విచారణ వ్యక్తం చేస్తున్నారు. మరలా వాతావరణ శాఖ తుఫాన్ హెచ్చరిక చేయటంతో భయభ్రాంతులకు గురవుతున్నారు. ఆవాసాల మధ్య ఇప్పటికే మోకాలు లోతు నీళ్లలో రహదారులు నిండి ఉన్నాయని, మరల వర్షం కురిస్తే ఇళ్లలోకి వర్షపు నీరు వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురుకుల పాఠశాల సమీపంలో మట్టి రోడ్లు బురద కయ్యగా మారాయని, ఆ ప్రాంతమంతా జలమయంగా మారిందని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. పల్లపు ప్రాంతాల్లోనే వర్షపు నీటిని బయటకు తరలించేందుకు పాలకులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-అవనిగడ్డ : పేదల గహ నిర్మాణాలు వేగవంతం చేయాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ సూచించారు. శనివారం అవనిగడ్డలోని ఎమ్మెల్యే కార్యాలయంలో గృహ నిర్మాణ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అవనిగడ్డ ఇంచార్జ్ ఎస్ వెంకట్రావు ఎమ్మెల్యేను కలసి నియోజకవర్గంలో గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న పనులు వివరించారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో స్థలాలు కలిగి గృహాలు నిర్మించుకునేందుకు సిద్ధంగా ఉన్న 2198 మందిని గుర్తించినట్లు తెలిపారు. వీరంతా నవంబర్ 5వ తేదీ లోపు తమ గ్రామ సచివాల యాల్లో వివరాలను ఇంజనీరింగ్ అసిస్టెంట్ల ద్వారా లో నమోదు చేసుకోవాల్సి ఉందని తెలిపారు. పేదల సొంత ఇంటి కల నెరవేర్చేం దుకు ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా గృహ నిర్మాణాలు వేగవంతం చేసేందుకు కషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ సమా వేశంలో గృహ నిర్మాణ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డోకిపర్రు ఆలయంలో అన్నసమారాధన

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో భక్తుల తాకిడి అధికమైంది. శనివారం దూరప్రాంతాల నుండి వచ్చిన భక్తులకు భారీ అన్నసమారాధనను నిర్వహించారు. మెయిల్ మేనేజింగ్ డైరెక్టర్ పురిటిపాటి వెంకట కష్ణారెడ్డి, సుధారెడ్డి ఆర్థిక సాయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వేలాది మంది భక్తులు అన్నప్రసాదాల్ని స్వీకరించారన్నారు. స్వామివారికి విశేషాభిషాకాలతో పాటు ప్రత్యేక పూజల్ని వేద పండితులు చేపట్టారు. స్వామివారి దర్శనానికి వేలాది మంది భక్తులు బారులు తీరారు. స్వామివారు సర్వ పుష్పాలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి తీర్థప్రసాదాల్ని భక్తులు స్వీకరించారు. స్వామివారి పూజా కార్యక్రమాల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



ఆలయానికి వచ్చిన యాత్రికులు



కళాకారులకు సత్కారం

ప్రజాశక్తి-పామర్రు : సమాజంలోని వివిధ రుగ్మతల నుండి ప్రజల్ని చైతన్యపరిచే శక్తి కళలకు ఉందని లైన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు సీనియర్ వైద్యులు డాక్టర్ బి.వి అప్పారావు అన్నారు. అంతర్జాతీయ కళల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం స్థానిక హితం పాఠశాల కార్యాలయంలో ఘంటసాల కళా పీఠం ఆధ్వర్యంలో కూచిపూడి నాట్య గురువు వేదాంతం రాదేశ్యామ్ పౌరాణిక నాటక రంగం నటుడు అరవ పిల్లి రావు,గాయకుడు సంజీవరావు, తబలా వాయిద్య కారుడు శంకర్, హార్మోనియం,స్టేజి నటన వంటి ఇతర రంగాలకు చెందిన కొల్లి సత్యనారా యణ రెడ్డి, అంజిరెడ్డి,మాచిరాజు రాంబాబు, మల్లేశ్వరమ్మ తదితరులకు సత్కారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఘంటసాల కళాపీఠం అధ్యక్షులు కాటూరు వెంకట మురళీకష్ణ, కార్యదర్శి హేమంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బ్రోచరును ఆవిష్కరిస్తున్న రావి వెంకటేశ్వరరావు

సురక్ష యాప్ బ్రోచర్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి - గుడివాడ : మద్యం నాణ్యత తెలుసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా నాణ్యతను తెలుసుకోవాలని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం సెంట్రల్ వైన్స్ మద్యం షాపుల వద్ద మద్యం నాణ్యతను తెలుసుకునే యాప్ బ్రోచర్లను రావి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం బాటిల్‌పై ఉన్న క్యూఆర్ కోడ్‌ను సురక్ష యాప్ ద్వారా పరిశీలించి మద్యం నాణ్యతను తెలుసుకోవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిఐ పి.రమణ, జనసేన నాయకులు బూరగడ్డ శ్రీకాంత్, టిడిపి నాయకులు జగన్‌మోహనరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వర్షాలకు పంటలు పాడవకుండా రైతులకు సూచనలు

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : ఆచార్య ఎన్ జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం ఘంటసాల శాస్త్రవేత్తల బృందం శనివారం తోట్లవల్లూరు మండలంలో పర్యటించింది. వల్లూరుపాలెం, బొడ్డపాడు గ్రామాలలో అకాల వర్షాలకు పంటలు పాడవకుండా రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పంటలపై రైతులకు అవగాహన కలిగించి క్షేత్ర సందర్శనలు చేశారు. ప్రస్తుత కాలంలో వరి పంట ఈనిక దశ నుండి గింజ పాలు పోసుకునే దశ వరకు ఉందని, ఈ అకాల అధిక వర్షాలకు పంట దెబ్బతిని తాలు గింజలు ఏర్పడే అవకాశం ఉందని కృషి విజ్ఞాన కేంద్రం ఘంటసాల సమన్వయకర్త డా. డి. సుధా రాణి రైతులకు వివరించారు. ఈ వర్షాలకు మానిపండు తెగులు ఆశించే ఆస్కారం ఉంటుందని, వ్యాప్తి నివారణకు వర్షాలు తగ్గుముఖం పట్టిన తర్వాత ప్రోపికోనజోల్ 200 మిల్లీలీటర్లు ఎకరానికి పిచికారీ చేసుకోవాలని రైతులకు సూచించారు. నీటి ముంపు గురైన చెరుకు పొలాలలో తెగులు ఆశించే అవకాశం ఉన్నందున కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. లేక ప్రోపికొనజోల్ 1.0 మీ.లీ లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేసుకోవాలని,. పసుపులో ఆకు మచ్చ తెగులు నివారణకు ప్రోపికొనజోల్ 1.0 మీ.లీ లీటరు నీటికి చొప్పున పిచికారీ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త డా. రేవతి, యమ్. పి.ఇ.ఓ. కుమార్, ఉద్యాన సహాయకులు శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.



రైతులకు సూచనలు ఇస్తున్న అధికారులు

కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి - కలక్టరేట్ (కృష్ణా) : జిల్లా వైద్యా ఆరోగ్య శాఖాధికారిగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ పి.యుగంధర్ శనివారం జిల్లా కలెక్టర్ డికె బాలాజీని మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టరేట్ లోని కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్‌ను కలిసి పుష్ప గుచ్ఛం అందించారు.



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న డిఎంహెచ్‌ఒ

సిఎం సహాయనిధి చెక్కు పంపిణీ



ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని పోచంపల్లి గ్రామానికి చెందిన యలగాల వెంకట నరసమ్మ గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఆపరేషన్ కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుండగా ఎమ్మెల్యే రాజగోపాల్ సిఫార్సు లేఖ ద్వారా ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎం రిలీఫ్ ఫండ్)కి దరఖాస్తు చేసుకున్నారు. దీంతో ఆమెకు ముఖ్యమంత్రి సహాయనిధి నుండి రూ. 2 లక్షల చెక్కు మంజూరైంది. సంబంధిత చెక్కును బాధితురాలి కుటుంబ సభ్యులకు శనివారం ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తన నివాసంలో స్వయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పింగళ రామకృష్ణారెడ్డి, కామిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, చింతారెడ్డి వెంకట నర్సిరెడ్డి, గొర్రెపాటి సుబ్బారావు, పులగం రాంబాబు, గోళ్ళ నాగరాజు, కనపర్తి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టెట్‌పై సుప్రీం తీర్పుకు వ్యతిరేకంగా రివ్యూ పిటిషన్ వేయాలి : ఎస్‌టియు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: ఉపాధ్యాయులుగా నియమింపబడిన వారంతా టెట్ ఉత్తీర్ణులవ్వాలన్న సుప్రీంకోర్టు తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం జాప్యం లేకుండా వెంటనే రివ్యూ పిటిషన్ వేయాలని ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు వేముల బిక్షమయ్య కోరారు. రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్‌టియు) జగ్గయ్యపేట, వత్సవాయి మండల శాఖల ఆధ్వర్యంలో త్వరలో జరగనున్న 79వ ఎస్‌టియు ఎన్‌టిఆర్ జిల్లా వార్షిక కౌన్సిల్ సమావేశం ఏర్పాట్లు, విధి విధానాలకు సంబంధించి శనివారం పట్టణంలోని టీచర్స్ సొసైటీ భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో భిక్షమయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 1.20 లక్షల ఇన్ సర్వీస్ టీచర్లు టెట్‌పై ఆందోళన చెందుతున్నారని, ప్రభుత్వం వెంటనే సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్ వేయడంతో పాటు పార్లమెంట్‌లో విద్యాహక్కు చట్టం సవరణకు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర కౌన్సిలర్ టి.వి.ఎల్.నరసింహారావు, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు జి.రవి కుమార్, జగ్గయ్యపేట అధ్యక్షులు కె.రాజేంద్ర, వత్సవాయి అధ్యక్షులు పి.ఆనంద్ కుమార్, మండల ప్రధాన కార్యదర్శి నరేష్, ఆర్థిక కార్యదర్శి పురుషోత్తం పాల్గొన్నారు.

కొలికిపూడిని బర్తరఫ్ చేయాలి : టిడిపి



ప్రజాశక్తి-ఎ.కొండూరు : టిడిపి కార్యకర్తలు కన్నెర్ర చేస్తే బాడవ వద్ద టోల్గేట్ దాటి తిరువూరు నియోజకవర్గంలోకి అడుగు పెట్టలేవని ఎమ్మెల్యే శ్రీనివాసరావును ఆ పార్టీ నేతలు హెచ్చరించారు. ఎంపి కేశినేనిని విమర్శించే స్థాయి కొలికిపూడికి లేదని తెలిపారు. ఎ.కొండూరులోని టిడిపి కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తిరువూరు ఎఎంసి మాజీ ఛైర్మన్ అలవాల రమేష్ రెడ్డి, మండల టిడిపి అధ్యక్షుడు భరోతు పీక్లా నాయక్ మాట్లాడుతూ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) ఎన్నికలకు ముందు నుండే కోటాది రూపాయలతో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారని, ఎ.కొండూరు మండలంలో కిడ్నీ బాధితులను ఆర్థికంగా ఆదుకున్నారని, ట్రస్ట్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలతోపాటు, తిరువూరు నియోజకవర్గ అభివృద్ధికి కోట్లాది రూపాయలు ఖర్చు చేశారని తెలిపారు. తిరువూరు నియోజకవర్గంలో వైసిపి నాయకులతో కుమ్మక్కై ఎమ్మెల్యే చేస్తున్న అవినీతి అక్రమాలను ప్రజలు గమనిస్తూనే ఉన్నారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మట్టి మాఫియా, ఇసుక మాఫియా, మద్యం మాఫియా, రేషన్ మాఫియాలను నిర్వహిస్తూ నియోజకవర్గంలో టిడిపిని భ్రష్టు పట్టించావని ఆరోపించారు. ఎ.కొండూరు మండల వైసిపి ఎంపిపి భర్త ఆధీనంలో ఉన్న గోపాలపురం వద్ద ఉన్న మట్టి క్వారీ నీ చేతికి ఎలా వచ్చిందో చెప్పాలని నిలదీశారు. తిరువూరు నియోజకవర్గంలో టిడిపికి ఎమ్మెల్యే కొలికిపూడి తీవ్ర నష్టం కలిగించారని, పార్టీ నాయకత్వం జోక్యం చేసుకొని ఎమ్మెల్యేను వెంటనే భర్త రఫ్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ఎస్‌టి సెల్ అధ్యక్షుడు బాణావతు భీమా నాయక్, చీమలపాడు పీఏసీఎస్ అధ్యక్షుడు బెజవాడ శంకర్, పిన్నమనేని శ్రీనివాసరావు, పిఎసిఎస్ అధ్యక్షులు అత్తునూరి శ్రీనివాస్ రెడ్డి, ఎలినేని కష్ణారావు, చల్లపల్లి కృష్ణారావు, పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణ పనులు పూర్తి చేయాలి

- సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు



ప్రజాశక్తి - విజయవాడ సిటీ : విజయవాడ నగరపాలక సంస్థ 50వ డివిజన్ మహంతిపురం జడ పాపయ్య వీధి ముంపు నివారణ చర్యలో భాగంగా సిసి రోడ్డు రూ.13 లక్షల వ్యయంతో మంజూరు చేశారు. రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభించిన బ్రిక్స్, డెస్ట్ పనులను సగం వరకు చేసి మధ్యలోనే సిసి రోడ్డు పనులను నిలుపుదల చేశారు. దీంతో కార్పొరేషన్ అధికారుల తీరు నిరసిస్తూ శనివారం సాయంత్రం 50వ డివిజన్లో సిపిఎం కార్పొరేటర్ బోయి సత్యబాబు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని విఎంసి కమిషనర్‌కు, అధికారులకు పలుమార్లు వినతి పత్రాలు అందజేసినట్లు సత్యబాబు తెలిపారు. కార్పొరేషన్‌లో నిధులు లేనందున కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లింపులు జరగక సకాలంలో పనులు పూర్తి చేయలేకపోతున్నామని అధికారులు తెలిపారన్నారు. ప్రభుత్వం విజయవాడ నగరానికి రావలసిన రూ.643 కోట్ల గ్రాంట్లు విడుదల చేయకుండా నగర అభివృద్ధికి మోకాలడ్డుతుందన్నారు. చిన్నపాటి వర్షాలకి ముంపు గురవుతున్న వన్ టౌన్ ప్రజల ఇబ్బందుల్ని పరిష్కరించే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. 50 డివిజన్లో మంజూరైన పైప్లైన్లు, కమిటీ హాలు, రిటైనింగ్ వాల్ పనులు సకాలంలో పూర్తి చేయాలని విఎంసి అధికారులను కోరారు. అధికారుల వైఫల్యాలు, పాలకుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఈ 27న విజయవాడ సర్కిల్ వన్ కార్యాలయం ఎదుట చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐద్వా పశ్చిమ గౌరవ అధ్యక్షురాలు గాదే ఆదిలక్ష్మి, సిపిఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫుల్ స్టక్ జావాతో ఉత్తమ కెరీర్



ప్రజాశక్తి - విజయవాడ సిటీ : ఫుల్ స్టక్ జావాలో ప్రావీణ్యం సాధించడం ద్వారా విద్యార్థులు సాఫ్ట్‌వేర్ డెవలపర్, వెబ్ డిజైనర్, సిస్టమ్ అనలిస్ట్‌లుగా తమ కెరీర్‌ను బలోపేతం చేసుకోవచ్చని హైదరాబాదుకు చెందిన ప్రముఖ టెక్ లీడ్ (టి.సి.ఎస్) జి.నవీన్ అన్నారు. కెబిఎన్ డిగ్రీ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో హ్యాండిల్ రియల్ టైం ప్రాజెక్ట్స్ ఇన్ ఇండస్ట్రీ యూజింగ్ ఫుల్ స్టక్ జావా అనే అంశంపై గెస్ట్ లెక్చర్ శనివారం నిర్వహించారు. రిసోర్స్ పర్సన్‌గా పాల్గొన్న నవీన్ మాట్లాడుతూ విద్యార్థులకు పరిశ్రమలో రియల్ టైమ్ ప్రాజెక్టులు ఎలా రూపుదిద్దుకుంటాయో వివరించారు. ఫ్రంట్ ఎండ్, బ్యాక్ ఎండ్ ఇంటిగ్రేషన్, డేటాబేస్ మేనేజ్‌మెంట్, స్ప్రింగ్ బూట్ వంటి ఆధునిక సాంకేతికతల వినియోగం గురించి తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కష్ణవేణి మాట్లాడుతూ పారిశ్రామిక అవసరాలకు తగిన సాంకేతిక నైపుణ్యాలను విద్యార్థులు పెంపొందించుకోవాలన్నారు. హిందూ హైస్కూల్స్ పరిపాలనాధికారి డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ పాఠ్యపుస్తకాల పరిధి దాటి వర్తమాన ప్రయోజనాలను దష్టిలో ఉంచుకుని విద్యార్థులు అధ్యయనం, పరిశోధన చెయ్యాలన్నారు. పి.జి కంప్యూటర్స్ విభాగాధిపతి డాక్టర్ వి.టి.రామ్ పవన్ కుమార్, పి.జి. కోర్సెస్ డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

జగ్గయ్యపేట సర్కిల్ పోలీస్ విభాగం ఆధ్వర్యంలో రోటరీ క్లబ్ వారి సౌజన్యంతో ఉక్కు కళా వేదికలో శనివారం ఏర్పాటు చేసిన రక్త దాన శిబిరాన్ని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య ప్రారంభించారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా పోలీస్ అమరవీరుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రక్త దాన శిబిరాన్ని ప్రారంభించారు. రక్తదాన శిబిరంలో పోలీసులు, ప్రజలు, యువకులు 160 మంది పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్ మాట్లాడుతూ రక్తదానంతో ఎంతోమంది ప్రాణాలు కాపాడవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, డిసి వైస్ చైర్మన్ మన్నె నారాయణరావు, కౌన్సిలర్ పేరం సైదేశ్వర రావు, మారేపల్లి శౌరి, బండారు రవి, సర్కిల్ ఇన్స్పెక్టర్ పి వెంకటేశ్వర్లు, ఎస్సైలు రాజు, శంకర్ నాయక్, లయన్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అకాల వర్షాలతో పత్తి రైతు దిగాలు

ప్రజాశక్తి- నందిగామ : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల పత్తి రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలకు పత్తి పంట పూర్తిగా కుళ్లిపోయి ఉడకేయడంతో పత్తి రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మరోపక్క మార్కెట్ మాయజాలంతో గత ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా పత్తి పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు దిక్కుతోచక కొట్టుమిట్టాడుతున్నారు. మరోపక్క అమెరికా నుండి పత్తి దిగుమతి సుంకం మినహాయించడంతో పత్తి కొనేవారు లేక రైతులు దళారులకు అమ్ముకుంటున్నారు. పశ్చిమ కృష్ణా ప్రాంతంలో సుమారు 70 వేల ఎకరాల్లో ప్రతి సాగు చేశారు. పత్తి పంట చేతికి వస్తున్న తరుణంలో వర్షాల దెబ్బకు పంట పూర్తిగా దెబ్బతింది. పత్తి కొనుగోలు చేసేందుకు ఇప్పటి వరకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదు. వర్షాలకు పత్తి తడిసిందని, తేమ శాతం ఎక్కువగా ఉందని సాకుగా చూపిస్తూ వ్యాపారులు అడ్డగోలుగా కోత పెడుతూ కింటా పత్తిని రూ.5000 లోపు కొనుగోలు చేస్తున్నారు. ఆల్పపీడన ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పత్తి, మొక్క జొన్న పంటలకు నష్టం వాటిల్లి రైతులు ఆవేదన చెందుతున్నారు. నందిగామ మండలం పల్లగిరి శివారు సత్యవరంలో పత్తి పొలాలు వర్షానికి నల్లబారుతున్నాయి. పల్లగిరి వద్ద పత్తి ఎర్రగా మారాయి. వర్షానికి పత్తి కాయల నుంచి మొలకలు వచ్చాయని, తీవ్రంగా నష్టపోయాయని



కౌలు రైతు నరేంద్ర ఆందోళన వ్యక్తం చేశారు.

అల్పపీడన ప్రభావంతో నాలుగైదు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో పత్తితీత తీయడానికి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈఏడాది అధిక వర్షాలతో పత్తిలో పూత, పిందె రాలిపోయి ఎకరానికి 4 నుంచి 5 క్వింటాళ్ల పత్తి మాత్రమే వస్తోంది. ఈక్రమంలో తీరా మొదటి తీత సమయంలో ఎడతెరపి లేకుండా వర్షాలు పడుతుండటంతో పగిలిన పత్తి కాయలు ముడుచుకుపోతున్నాయి. కాయలు నల్లగా మారి కుళ్లి పోతుండటంతో తీవ్రంగా నష్టం వాటిల్లుతోందని రైతులు చెబుతున్నారు. మరోవైపు వ్యాపారులు తడిసిన పత్తిని నాణ్యత లేదంటూ ఇష్టం వచ్చిన ధరకు అడుగుతుండటం రైతులను మరింత ఆందోళనకు గురి చేస్తుందని, కూటమి ప్రభుత్వం స్పందించి పంట నష్టపరిహారం అందించి అదుకోవాలని రైతులు కోరుతున్నారు.

హామీలను విస్మరించడం సరికాదు : వైసిపి

ప్రజాశక్తి- విజయవాడ సిటీ : ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రైవేటు వ్యక్తులకు దారాదత్తం చేయడాన్ని వ్యతిరేకిస్తూ వైసిపి అధినాయకత్వం పిలుపు మేరకు ఈ నెల 28న భవానీపురం బ్యాంకు సెంటర్‌లోని వైఎస్ఆర్ విగ్రహం నుండి పశ్చిమ ఎంఆర్ఓ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ చేపడుతున్నట్లు ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పొదిలి చంటిబాబు తెలిపారు. భవానీపురంలో ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక కూటమి నేతలు విస్మరించడం సిగ్గుచేటని విమర్శించారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు, విద్యార్థి, ప్రజా సంఘాలు ఈ నిరసన ర్యాలీలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.




కేన్సర్‌పై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: కేన్సర్ పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని బసవతారకం కేన్సర్ హాస్పటల్ సీనియర్ వైద్యులు రవిశంకర్ తెలిపారు. పట్టణంలోని వాగ్దేవి మహిళా కళాశాల, కెసిపి సిమెంట్, బసవతారకం కేన్సర్ హాస్పిటల్ హైదరాబాద్ సంయుక్తంగా కేన్సర్‌పై అవగాహన ర్యాలీ శనివారం నిర్వహించారు. అనంతరం జరిగిన అవగాహనా సదస్సులో డాక్టర్ రవిశంకర్ మాట్లాడుతూ కేన్సర్ పట్ల అప్రమత్తంగా ఉండి జాగ్రత్త తీసుకోవాలని వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ బుస్సా సురేష్ మాట్లాడుతూ.. యాంటీ క్యాన్సర్, యాంటీ ఆక్సిడెంట్స్ ఉండే ఆహార పదార్థాలను ఎక్కువగా ఉపయోగించడం, ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం ద్వారా కేన్సర్‌ను నివారించవచ్చని తెలిపారు. కెసిపి సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మధుసూదన్ మాట్లాడుతూ విద్యార్థులు కేన్సర్ పట్ల అవగాహన పెంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ బుస్సా సరిత, పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని తిరుమలగిరి గ్రామంలో గల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో జరుగుచున్న నిత్యాన్నదాన పథకానికి తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లా కోదాడ మండలం కాపుగల్లు గ్రామానికి చెందిన ఏజెండ్ల రామకృష్ణయ్య, నాగమణి రూ.11,116లు నందిగామ పట్టణానికి చెందిన బండిపోయిన రాము, మమత రూ.34,551 విరాళంగా అందజేశారు.

డాక్టర్ కందుల అప్పారావుకు మాతృ వియోగం



ప్రజాశక్తి- నందిగామ : నందిగామకు చెందిన ప్రముఖ వైద్యులు, శ్రీ విద్యా గ్రూప్ సంస్థల అధినేత డాక్టర్ కందుల అప్పారావుకు మాతృవియోగం కలిగింది. ఆయన మాతృమూర్తి కందుల వైదేహి(86) శనివారం వృద్ధాప్యంతో మృతి చెందారు. ఆమెకు కుమారులు డాక్టర్ కందుల అప్పారావు, శ్రీనివాసరావు, మల్లికార్జునరావులు ఉన్నారు. వైదేహి భౌతికకాయాన్ని పలువురు ప్రముఖులు సందర్శించి నివాళులర్పించారు.

మంగినపూడి బీచ్ తాత్కాలికంగా మూసివేత

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : మచిలీపట్నం మండలంలోని మంగినపూడి బీచ్‌ను మోంత తుఫాన్ కారణంగా తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు తాలూకా ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. ఉన్నతాధికారులు ఆదే శాల మేరకు మత్స్యకారులు ఎవ్వరు సముద్రంలో వేటకు వెళ్లరాదని తెలిపారు. అలాగే కార్తీక మాసం సందర్భంగా వివిధ ప్రాంతాల నుండి బీచ్ వచ్చే పర్యాటకులు, భక్తులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

27న 'మీకోసం' రద్దు : ఈనెల 27వ తేదీన సోమవారం కలెక్టరేట్లో జరగవలసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక ు-మీకోసం కార్యక్రమాన్ని రానున్న తుఫాన్ కారణంగా రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఒక ప్రకటనలు తెలిపారు. జిల్లాలో ఈనెల 27 నుండి 29 వ తేదీ వరకు తుఫాను కారణంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు విషయం గమనించి ఎవరూ కూడా అర్జీలు తీసుకొని కలెక్టరేట్‌కు రావద్దని కలెక్టర్ కోరారు.

రేపు అవనిగడ్డకు వాటర్‌మెన్ రాజేంద్రసింగ్ రాక

ప్రజాశక్తి-అవనిగడ్డ : మండలి వెంకట కృష్ణారావు శత జయంతి పురస్కారం అందుకునేందుకు ఈ నెల 27న వాటర్ మెన్ డాక్టర్ రాజేంద్ర సింగ్ అవనిగడ్డకు విచ్చేయ నున్నట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు అవనిగడ్డ గాంధీ క్షేత్రంలో"కృష్ణానది సంరక్షణ"గ్రామస్థాయిలో నీటి పరిరక్షణ చర్యలు, భవిష్యత్తు తరాల కోసం నదులు కాపాడడంలో ప్రజల పాత్ర"అనే అంశంపై చర్చాగోష్ఠి నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మండల వెంకటకృష్ణారావు శతజయంతి పురస్కారం ఆయనకు ప్రదానం చేయనున్నట్లు బుద్ధ ప్రసాద్ చెప్పారు.

సాగర్ నీటితో చెరువులు నింపుకోవాలి

ప్రజాశక్తి-ఉంగుటూరు - (బాపులపాడు) : వేంపాడు మేజర్‌లోని 39వ కిలోమీటర్ నుండి పొట్లకాయకుంట చెరువుకు విడుదలైన సాగర్ వరద జలాలకు నాగార్జునసాగర్ ఎడమ కాలువ ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ళ వెంకట గోపాలకష్ణారావు, మడిచర్ల డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ దేవినేని సత్యనారాయణ, బిళ్ళనపల్లి నీటి సంఘం అధ్యక్షులు కాకుమాను గోపి, బాపులపాడు టిడిపి అధ్యక్షులు దయాల రాజేశ్వరరావు తదితరులు స్వాగతం పలికారు. గోపాలకష్ణారావు మాట్లాడుతూ నాగార్జునసాగర్ డ్యామ్ నుండి వచ్చిన ఈ నీటిని వృథా కాకుండా అన్ని చెరువులను నింపుకోవాలని ఆయకట్టుదారులను కోరారు. అక్కినేని రవికుమార్, పల్నాటి భాస్కరరావు, ఎన్ఎస్పి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి.ఎస్.డి.జయరాజు తదితరులు పాల్గొన్నారు.

లూలూకు లీజుకిచ్చే ప్రతిపాదన విరమించాలని ధర్నా



ధర్నా చేస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-ఉంగుటూరు (బాపులపాడు) : మల్లవల్లి కోర్ ప్రాసెసింగ్ సెంటర్‌ను ప్రైవేట్ సంస్థకు లీజు ఇవ్వడాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు బాపులపాడు మండల కమిటీ శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కృష్ణా జిల్లా పారిశ్రామిక క్లస్టర్ ప్రధాన కార్యదర్శి బేత శ్రీనివాసరావు మాట్లాడుతూ మల్లవల్లి కోర్ ప్రాసెసింగ్ సెంటర్‌ను లూలూ సూపర్ మార్కెట్‌కు దీర్ఘకాలిక లీజు ఇవ్వడాన్ని వెంటనే విరమించుకోవాలన్నారు. 77 కోట్ల రూపాయలతో 7.48 ఎకరాల్లో నిర్మించిన ఈ సంస్థ 107.40 కోట్ల మూలధన పెట్టుబడితో ఒక గంటకు 7,500 ప్యాకెట్ల ఉత్పత్తి సామర్థ్యం కలిగి ఉందన్నారు. అలాంటి సంస్థను లూలూ సూపర్ మార్కెట్‌కు 66 సంవత్సరాలు (33 సంవత్సరాలు పొడిగింపు ఎంపిక) కేవలం సంవత్సరానికి 0.46 శాతం లీజుకే ఇవ్వడం అనుచితమన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు కళ్ళం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కోర్ ప్రాసెసింగ్ సెంటర్ కోసం రైతుల దగ్గర నుంచి 2013 భూసేకరణ చట్టం ప్రకారం భూమి తీసుకున్నారని, దానికి తగిన పరిహారం కూడా చెల్లించలేదన్నారు.లూలూ సంస్థకు లీజుకు ఇచ్చే ప్రతిపాదనను తక్షణం విరమించుకోవాలని లేదంటే, రైతులు, కార్మిక వర్గాన్ని ఐక్యం చేసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు బాపులపాడు మండల కార్యదర్శి నల్లి ఆంజనేయులు, రాజనాల సురేష్, తోట సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టు శ్రీనివాసరావు కుటుంబానికి అండగా ఉంటాం : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-గన్నవరం : ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన సీనియర్ జర్నలిస్ట్ నెక్కలపు శ్రీనివాసరావు కుటుంబాన్ని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పరామర్శించారు. శనివారం మధ్యాహ్నం ఎమ్మెల్యే యార్లగడ్డ గన్నవరంలోని శ్రీనివాసరావు నివాసానికి చేరుకుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ సుమారు 8 సంవత్సరాల క్రితం తాను నియోజవర్గానికి వచ్చినప్పటి నుండి శ్రీనివాస్‌తో పరిచయం ఉందని గుర్తు చేసుకున్నారు. ప్రజాశక్తిలో పనిచేస్తున్నప్పటికీ ఏ పార్టీకి కొమ్ము కాయకుండా వార్తలు రాసే వారని తెలిపారు. మృతిచెందిన శ్రీనివాసరావు కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు గౌడపేటలోని స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకుని వాటి పరిష్కార దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గన్నవరం మండల టీడీపీ అధ్యక్షులు గూడపాటి తులసి మోహన్, ఎంపీటీసీ పటమట రంగారావు, వైస్ ఎంపిపి కొమ్మరాజు సుధీర్, టీడీపీ నాయకులు గొంది నరేంద్ర, ఎంపీటీసీ మద్దినేని వెంకటేశ్వరావు, నాగార్జున, రంగబాబు, పాలడుగు నాని, మన్నెం శ్రీనివాసరావు, ధర్మారావు పాల్గొన్నారు.


శ్రీనివాసరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంఎల్ఎ యార్లగడ్డ

మహాసభ వాయిదా

ప్రజాశక్తి-అవనిగడ్డ :గన్నవరంలో ఆదివారం జరగనున్న ఏపీ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ కృష్ణా జిల్లా 9వ మహాసభ అకాల వర్షం కారణంగా నవంబర్ రెండవ తేదీకి వాయిదా వేసినట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి మత్రపు పోలినాయుడు తెలిపారు. ఈ మేరకు అవనిగడ్డలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ మహాసభలో కార్మికులకు కనీస వేతనం, ఈఎస్ఐ, పిఎఫ్, ఇన్సూరెన్స్ అమలు చేసి కార్మికులందరినీ రెగ్యులర్ చేయు విధంగా పోరాటం చేసే దానికి కార్యచరణ ఈ మహాసభలో నిర్ణయిస్తామన్నారు. అందువల్ల పంచాయతీ కార్మికులు ఆదివారం జరిగే మహాసభ వాయిదా గమనించి, తిరిగి నవంబర్ రెండవ తేదీన జరిగే మహాసభలో పాల్గొని జయప్రదం చేయాలని పోలినాయుడు కోరారు. ఈ కార్యక్రమంలో ఆ జిల్లా అధ్యక్షులు కొడాలి శ్రీనివాసరావు పాల్గొన్నారు.


దిలీప్‌ను అభినందిస్తున్న బండి రామకృష్ణ

దిలీప్‌కుమార్‌కు అభినందనలు

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : మచిలీపట్నం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ ఇమడబత్తుల దిలీప్‌కుమార్‌ను మచిలీపట్నం జనసేన పార్టీ ఇంచార్జ్, ఉమ్మడి కృష్ణాజిల్లా డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ శనివారం కలిసి అభినందనలు తెలియజేశారు. ప్రమాణ స్వీకార సమయంలో తాను హైదరాబాదులో ఉన్నందున వచ్చిన వెంటనే దిలీప్ కుమార్ ఇంటికి వెళ్లి తన అభినందనలు తెలిపినట్లు తెలిపారు. జనసేన పార్టీ మచిలీపట్నం నగర అధ్యక్షులు గడ్డం రాజు, జనసేన పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

వైజెఆర్‌డిఎంఎస్‌లో వర్క్‌షాప్



ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : మచిలీపట్నంలోని స్థానిక వైజెఆర్ డిఎంఎస్ కాలేజ్ ఆఫ్ ఇంజనీ రింగ్‌లో డిపార్ట్మెంట్ ఆఫ్ ఈసిఈలో క్లౌడ్ స్టాండ్ టెక్నాలజీస్ హైదరా బాద్ వారి ఆధ్వ ర్యంలో హ్యాండ్స్ ఆన్ హార్డ్ వేర్, ఎలెక్ట్రానిక్స్ ఫర్ ఇన్నోవేటర్స్ ప్రోగ్రామ్ శనివారం విజయవంతంగా జరిగింది. ఈ వర్క్ షాప్ లో ఫస్ట్ ఇయర్ బి టెక్ (ఈ సి ఈ) ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ అండ్ డేటా సైన్స్, ఫస్ట్ ఇయర్ పాలిటెక్నిక్ మొత్తం 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఫండమెంటల్ ఎలక్ట్రానిక్ కాన్సెప్ట్ అయిన ఓల్టేజ్, కరెంట్, పవర్ గురించి తెలుసుకోవటం తోపాటు బేసిక్ ఎలక్ట్రానిక్ కాంపోనెంట్స్ రెసిస్టర్స్ ,కెపాసిటర్స్, డయోడేస్, ట్రాన్సిస్టర్స్ ఉపయోగించి సర్క్యూట్ బిల్డ్ చేయటం, ట్రోబుల్ షుటింగ్ మొదలైన వివిధ అంశాలలో ఈ వర్క్ షాప్ ద్వారా విద్యార్థులకు వివరించారు. క్లాస్ రూమ్ లో భోదించే థియరేటికల్ సబ్జక్ట్స్ అర్థం అవడానికి ఈ వర్క్ షాప్ చాలా ఉపయోగపడుతుందని క్లౌడ్ స్టాండ్ టెక్నాలజీస్ డైరెక్టర్ చల్లా సురేష్ తెలిపారు. ఎంబెడెడ్ ఇంజనీర్స్ హరి ప్రసాద్, సుకన్య శిక్షణ లో జరిగిన ఈ వర్క్ షాప్ లో ఈసిఈ హెచ్ఓడి, వైస్ ప్రిన్సిపల్ డా. నాగజ్యోతి, ఫ్యాకల్టీ కో ఆర్డినేటర్ లు పి శేఖర్, పి ఎల్ ఎస్ నరసింహారావు, ప్రిన్సిపాల్ డా.టి రవికుమార్‌లు పాల్గొన్నారు.

ఢమరుక గంటానాధ బహూకరణ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరు శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి వారి దేవస్థానానికి రూ.17వేల విలువైన ఢమరుక గంటానాధాన్ని వీరమాచినేని నాగకృష్ణ(నాని) శనివారం బహూకరించారు. కార్యక్రమంలో ఎస్ఈఆర్ఎమ్ విద్యా సంస్థల చైర్మన్ వల్లభనేని వెంకట్రావు, మాజీ జెడ్పీటీసీ కొసరాజు బాపయ్యచౌదరి, నెప్రూా పశువుల సంత కమిటీ చైర్మన్ వల్లభనేని సుబ్బారావు, ఏఎంసీ చైర్మన్ పొట్లూరి రవికుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు వెనిగెళ్ల నాగేశ్వరరావు, కోగంటి లక్ష్మీనారాయణ, రాధాకష్ణ, దేవస్థాన ధర్మకర్తలు మురాల నరేష్, రవి తదితరులు పాల్గొన్నారు.


ఢమరుక గంటానాధాన్ని బహూకరిస్తున్న దృశ్యం

మోపిదేవి ఆలయం కిటకిట

ప్రజాశక్తి-మోపిదేవి : మోపిదేవి శ్రీ వల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానంలో నాగులచవితి వేడుకలను అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రారంభించారు. శనివారం తెల్లవారు ఝామున 2:30 గంటలకు మోపిదేవి దేవస్థానానికి కుటుంబ సమేతంగా విచ్చేసిన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ - విజయలక్ష్మి దంపతులు, నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రామ్ - సాయి సుప్రియ దంపతులు నాగ పుట్టలో పాలు పోసి పూజలు చేశారు. గర్భాలయంలో కొలువై ఉన్న స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారిని దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో డిప్యూటీ కమిషనర్, చల్లపల్లి ఎస్టేట్ దేవాలయాల ఈఓ దాసరి శ్రీరామ వరప్రసాదరావు, సూపరింటెండెంట్ అచ్యుత మధుసూధనరావు సత్కరించి స్వామివారి చిత్రపటం, ప్రసాదం బహుకరించారు.

ఎంపీ బాలశౌరి పూజలు : నాగులచవితి సందర్భంగా మోపిదేవి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలో ఎంపీకి స్వాగతం పలికిన అధికారులు, అర్చకులు అనంతరం ఎంపి స్వామివారి నాగపుటలో పాలు పోసి నాగపుట్ట పూజ నిర్వహించారు. నాగుల చవితి సందర్భంగా నాగపుట్ట వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆలయ మర్యాదలతో ఎంపీ బాలశౌరిని ఘనంగా సత్కరించారు. స్వామివా చిత్రపటాన్ని ప్రసాదాలను అందజేశారు. అలాగే సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని బీసీ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సత్యనారాయణ దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలో గల నాగపుట్టలో సత్యనారాయణ పాలు పోసి, మొక్కులు చెల్లించుకున్నారు.


పుట్టలో పాలు పోస్తున్న అవనిగడ్డ ఎంఎల్ఎ బుద్ధప్రసాదు దంపతులు


బస్సులు రాకపోవడంతో ఎండలో యాత్రికులు

బస్సులు లేక ఇబ్బందులు

ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. నాగుల చవితి పర్వదినం సందర్భంగా మోపిదేవిలోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానానికి వచ్చిన భక్తులు ఆర్టీసీ బస్సులు లేక తీవ్ర ఇక్కట్ల పాలయ్యారు. నాగుల చవితి పర్వదినం సందర్భంగా శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానంలో జరిగిన సమన్వయ కమిటీ సమావేశంలో ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తామని అవనిగడ్డ ఆర్టీసీ అధికారి తెలిపారు.కానీ ఆర్టీసీ బస్సులు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయకపోవడంతో శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానానికి వచ్చిన భక్తులు మండుటెండలో పడిగాపులు పడవలసి వచ్చింది. వికలాంగులు, చిన్న పిల్లలు సైతం మండుటెండలో తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

వాలీబాల్ పోటీలకు గీతాంజలి విద్యార్థి



ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డిగూడెంలోని గీతాంజలి హైస్కూల్ విద్యార్థి గంటా జగన్ జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. నరసాపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో డివిజన్ స్థాయిలో అండర్ - 14 విభాగంలో జరిగిన వాలీబాల్ పోటీల్లో జగన్ పాల్గొని ప్రతిభ కనబర్చడంతో జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. జగన్‌ను గీతాంజలి మేనేజ్మెంట్, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన



ప్రజాశక్తి-మైలవరం : లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం ఆధ్వర్యంలో శనివారం స్థానిక రెసోనన్స్ జూనియర్ కళాశాల, వివేకానంద, గౌతమ్ పాఠశాలలోని విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లయన్ పాస్ట్ గవర్నర్, కెరీర్ గైడెన్స్ కోఆర్డినేటర్ అన్నపరెడ్డి కోటిరెడ్డి మాట్లాడుతూ పట్టుదల, కృషి, క్రమశిక్షణ కలిగి ఉంటే ఏదైనా సాధించవచ్చు అన్నారు. చదివేటప్పుడు ఏకాగ్రత అవసరమని తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని, తద్వారా తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ జాస్తి వెంకటేశ్వరరావు, మైలవరం లైన్స్ పీఎస్టీలు చనుమోలు నాగభూషణం, శీలం రామిరెడ్డి, చలవాది హరీష్ కుమార్ గుప్తా, లైన్స్ సీనియర్ నెంబర్లు పి రాజారెడ్డి, లేళ్ల ఏడుకొండలు, లైన్స్ మెంబర్లు సంగు రాంప్రసాద్, డి కష్ణమోహన్, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ సురక్ష యాప్ కరపత్రాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి-కంచికచర్ల : షాపుల్లో విక్రయిస్తున్న మద్యం కల్తీదా, నాణ్యమైనదా తెలుసుకోవడానికి "ఎక్సైజ్ సురక్ష యాప్"ను రూపొందించినట్లు ఎక్సైజ్ సిఐ అష్రఫున్నీసాబేగం, కంచికచర్ల సిఐ డి.చవాన్, ఎస్ఐ పి.విశ్వనాథ్ తెలిపారు. కంచికచర్ల సిఐ కార్యాలయంలో ఎపి ఎక్సైజ్ సురక్ష యాప్ కరపత్రాలను శనివారం వారు ఆవిష్కరించారు. ఈ కరపత్రాలను అన్ని షాపులకు అందజేసి వినియోగదారులందరూ ఎక్సైజ్ సురక్ష యాప్ డౌన్లోడ్ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ యాప్ ద్వారా మద్యం నాణ్యతను నిర్ధారించుకోవచ్చని తెలిపారు. కల్తీ మద్యానికి సంబంధించి సులభంగా ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. ఎక్సైజ్ సురక్ష యాప్ గురించి ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని అన్నారు.



విద్యార్థులకు కంటి పరీక్షలు

ప్రజాశక్తి- నందిగామ

లయన్స్ క్లబ్ ఆఫ్ నందిగామ ఆధ్వర్యంలో శనివారం నందిగామ కాకతియ అపోలో స్కూల్‌లో బాల బాలికలకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి 56 మంది పిల్లలకు కళ్ళజోళ్లు పంపిణీ చేశారు. స్కూల్ పిల్లలకు కంటి ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ నందిగామ అధ్యక్షులు మాలెంపాటి ప్రసాదరావు, జిల్లా ఛైర్పర్సన్ విజన్ కేర్ యర్రంశెట్టి శ్రీనివాసరావు , కాకతీయ అపోలో స్కూల్ ప్రిన్సిపల్ కాపా రవీంద్ర , లయన్స్ క్లబ్ నాయకులు యర్రంరెడ్డి గాంధీ ,మందడపు సీతారామయ్య, నుకవరపు సాంబశివరావు, రాయిడి లక్ష్మీ నరసింహరావు, చల్ల గాంధీ, రామిరెడ్డి శ్రీధర్, డాక్టర్ మహేంద్ర పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి :ఎస్ఎఫ్ఐ



ప్రజాశక్తి-వీరులపాడు : మండలంలోని పలు హాస్టళ్లలోని విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి షేక్ జాన్ సైదా డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఎన్‌టిఆర్ జిల్లా వీరులపాడు మండల తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జుజ్జూరు గ్రామంలో బిసి హాస్టల్‌ను వెంటనే ప్రారంభించాలని, అల్లూరు బాలికల హాస్టల్‌లో కొత్త భవనం నిర్మించాలని, వీరులపాడు ఎస్సీ హాస్టల్‌కు కాంపౌండ్ వాల్ నిర్మించాలని డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలను రూ.3 వేలకు పెంచాలని, విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు నిర్మించాలని, హాస్టళ్ల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉన్న విద్యార్థులందరికి ఉచిత బస్‌పాస్‌లు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల మండల అధ్యక్షుడు కె అనిల్ సాయి, నాయకులు అభిషేక్, అరుణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలంపల్లి డ్యామ్‌ను పునర్నిర్మించాలి : సిపిఎం

విజయవాడ : పోలంపల్లి డ్యామ్ పునర్నిర్మాణం చేసి పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల్లోని వేలాది ఎకరాలకు నీరు అందించాలని సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్‌సిహెచ్ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సిపిఎం పెనుగంచిప్రోలు మండల సమన్వయ కమిటీ సమావేశం పార్టీ నాయకులు దారా నాగేశ్వరరావు అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడుతూ పోలంపల్లిలో ఉన్న డ్యాం దెబ్బతిందని, ప్రభుత్వం వెంటనే స్పందించి డ్యాం పునర్నిర్మాణం చేయడానికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. అలాగే ఇటీవల కాలంలో వచ్చిన వరదలకు మైసమ్మ గుడి వద్ద పడిన గండిని పూడ్చాలని కోరారు. అనిగండ్లపాడు దళితవాడలో కాలువపై చప్టాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. నవంబర్ 7న విజయవాడలో జరిగే రెడ్ వాలంటీర్ల కవాతులో పాల్గొని జయప్రదం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు ఎరబోల రామారావు, సువార్తమ్మ,సిపిఎం మండల కార్యదర్శి వి గురవయ్య, గిరి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి - తిరువూరు : అనారోగ్యంతో మరణించిన ఏ.కొండూరు మండలం కోడూరు సొసైటీ సభ్యులు మల్లాది నాగేశ్వరరావు భార్య విమలమ్మకు మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేసినట్లు చైర్మన్ యాలినేని కృష్ణారావు శనివారం తెలిపారు. నాగేశ్వరరావుకు సొసైటీలో క్రాప్ లోను ఉన్నందున త్వరలోనే ఇన్సూరెన్స్ కూడా వస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కెడిసిసి బ్యాంకు కంభంపాడు బ్రాంచ్ చీఫ్ మేనేజర్ చంద్రశేఖర్ ఆజాద్, సంఘ కార్యదర్శి గడ్డి జమలారెడ్డి, మాజీ అధ్యక్షులైన యెలినేని చంద్రశేఖర రావు, పాల్గొన్నారు.

కెపిఐలకు శిక్షణ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని చిల్లకల్లు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో శనివారం జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలోని మహిళా, శిశు సంక్షేమ శాఖకు సంబంధించిన ముఖ్య పనితీరు సూచికలు (కెపిఐ)పై శిక్షణా కార్యక్రమం జగ్గయ్యపేట విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ యంగ్ ప్రొఫెషనల్ నరేష్ బాబు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మహిళా, శిశు సంక్షేమ శాఖకు సంబంధించిన ఏడు (7) నెలవారీ కీలక సూచికల ప్రాముఖ్యతను వివరించారు. సిఎం చంద్రబాబు నాయుడు "స్వర్ణాంధ్ర 2047" దృష్టిలో భాగంగా ఈ సూచికల అమలుపై రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట ఐసిడిఎస్ సిడిపిఒ సరళ, అడిషనల్ సిడిపిఓలు, సూపర్‌వైజర్లు, సి విపియు టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

జగ్గవరపుగుట్ట గ్రావెల్ అక్రమ తవ్వకాలు

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండలం రెడ్డిగూడెం గ్రామ రెవెన్యూ పరిధిలోని జగ్గవరపుగుట్ట గ్రావెల్‌ను ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ తవ్వకాలు చేపట్టి యథేచ్ఛగా తరలిస్తున్నారు. రాత్రి, పగలు లేకుండా గ్రావెల్ తోలకాలు సాగుతున్నాయి. అక్రమ గ్రావెల్ తవ్వకాలను అదుపుచేసే నాథుడే కరువయ్యారు. జగ్గవరపుగుట్టపై మైనింగ్ కమర్షియల్ మాఫియా కన్ను పడటంతో కొండ ఐస్ ముక్కలా కరిగిపోతుందని స్థానికులు తెలిపారు. రైతువారీ పేరుతో సాగుతున్న ఈ అనధికార తవ్వకాలతో గ్రామ పంచాయతీ ఆదాయానికి అక్రమార్కులు గండిపెడుతున్నారు. గత కొంతకాలంగా కొండను సైతం అక్రమంగా తవ్వి తరలిస్తుంటే సమాచారం తెలిసి కూడా పట్టించుకోవడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం జరిగిన అక్రమ గ్రావెల్ తవ్వకాలు గురించి తహశీల్దార్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నం చేయగా అందుబాటులోకి రాలేదు. విఆర్ఒ రమేష్‌ను వివరణ కోరగా తమ శాఖ నుంచి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదనీ, తవ్వకాలు జరిగే ప్రాంతానికి వెళ్లగా తనను చూసి ట్రాక్టర్లు, జెసిబి అక్కడి నుండి వెళ్లిపోయాయని తెలిపారు.



చట్టాలపై అవగాహన అవసరం : జడ్జి వందన

ప్రజాశక్తి- నందిగామ : ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని నందిగామ అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి.వందన అన్నారు. నందిగామ జిల్లా 16వ అదనపు న్యాయమూర్తి ఆదేశాల మేరకు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం నందిగామ సబ్ జైల్‌ను జడ్జి వందన సందర్శించారు. జైలు పరిసర ప్రాంతాలు తనిఖీ చేసి ఖైదీల వివరాలు, వారికి అందుతున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. లీగల్ ఎయిడ్ న్యాయవాది షేక్ ఆజాద్, జైలు సూపరింటెండెంట్ సిహెచ్.సీతారామారావు పాల్గొన్నారు.



అమ్రిత సాయిలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-కంచికచర్ల : కంచికచర్ల మండలం పరిటాల సమీపంలోని అమ్రిత సాయి ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో విజయవాడ వైస్ హాస్పిటల్ వారి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ కె.రామ మోహన రావు తెలిపారు. అమ్రిత సాయి ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరంలో వైస్ హాస్పిటల్స్ కన్సల్టెంట్ గైనకాలజిస్ట్ డాక్టర్ రమ్య కంటిపూడి, సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ వెలినేని పవన్ వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ కె.రామమోహన రావు మాట్లాడుతూ ఇటువంటి వైద్య సేవా కార్యక్రమాలను అమ్రిత సాయి ఎల్లప్పుడూ నిర్వహిస్తుంటుందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యమ్. శశిధర్ మాట్లాడుతూ వైద్య శిబిరాలను విద్యార్థులు, సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


వీధికెక్కిన నేతల పోరు

• కుంటుపడిన తిరువూరు అభివృద్ధి



ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, ఎంపి కేశినేని చిన్నిల నడుమ వివాదంతో తిరువూరు నియోజకవర్గ అభివృద్ధి కుంటుపడుతోంది. 20 సంవత్సరాల తర్వాత 2024 అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజార్టీతో టిడిపి అధికారంలోకి వచ్చింది. అధికారం చేపట్టిన ఈ ఇద్దరు ప్రజా ప్రతినిధులు ప్రజల సమస్యలను పరిష్కరించకపోగా ఇసుక, మట్టి, బియ్యం మాఫియా నువ్వు చేస్తున్నావంటే.. నువ్వు చేస్తున్నావంటూ ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ వివాదాలకు కేంద్ర బిందువులుగా మారుతూ నియోజక వర్గ అభివృద్ధిపై దష్టి పెట్టడంలేదు. కూటమి పాలనపై ఆశతో ఉన్న ప్రజలు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సిఫారసు కోసం ఎవరికి వద్దకు వెళ్లాలో అర్థం కాక అయోమయానికి గురవుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులన్నీ గోతులతో నిండిపోయాయి. గంపలగూడెం మండలం వినగడప కట్టలేరు వాగుపై ఉన్న బ్రిడ్జి కుప్పకూలి 9 ఏళ్ల అవుతున్నా నేటికీ హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు కాలేదు. ప్రభుత్వాలు మారినా బ్రిడ్జి నిర్మాణం చేపట్టకపోవడంతో వర్షాకాలంలో ప్రజల రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఎన్నిక సమయంలో స్థానిక సమస్యలు పరిష్కరిస్తామని, యువతకు ఉపాధి అవకాలు కల్పిస్తామని, అభివృద్ధికి నిధులు తెస్తామని హామీలు గుప్పించారు. అధికారంలోకి వచ్చాక హామీలను మరచి నేతలిద్దరూ కీచులాడుకుంటే ఇక తమ గోడు పట్టించుకునేది ఎవరంటూ ప్రజలు ఆవేదన చెందుతున్నారు. తిరువూరు నియోజకవర్గంలో తాగు, సాగునీరు సైతం అందని ద్రాక్షగా ఉంది. జవహర్ నవోదయ, గురుకుల విద్యాలయాలు లాంటి జాతీయ విద్యా సంస్థల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా ఉన్నా ప్రజా ప్రతినిధుల సహకారం శూన్యంగా ఉంది. తిరువూరు నగర పంచాయతీకి రూ.5 కోట్లు నిధులు మంజూరవ్వగా ఎమ్మెల్యే సిఫారసు చేసిన పనులను ఎంపి రద్దు చేశారు. ఎంపీ సిఫార్సు చేసిన పనులను ఎమ్మెల్యే చేయొద్దని అధికారులపై వత్తిడి చేస్తున్నారు. ఇటీవల రూ.56 లక్షలతో తిరువూరులో మాడిపోయిన వీధి లైట్ల స్థానంలో కొత్తవి అమర్చిన విషయంలోనూ ఇరువురు ప్రజా ప్రతినిధులు ఒకరికొకరు తామే చేయించామని చెప్పుకోవడం విశేషం. ఇచ్చిన హామీలు నెరవేర్చక వివాదాలతో కాలక్షేపం చేయడం రాజ్యాంగబద్ధంగా ప్రజలు ఎన్నుకొన్న ఎమ్మెల్యే, ఎంపీలకు తగునా అని నియోజవర్గ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ



అవనిగడ్డలో...



మొవ్వలో...

ప్రజాశక్తి-అవనిగడ్డ : రాష్ట్రంలో ప్రభుత్వం వైద్య విద్యను ప్రైవేటుకరించేందుకు చేపడుతున్న చర్యలకు వ్యతిరేకంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన పిలుపుమేరకు శనివారం మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త సింహాద్రి రమేష్ బాబు ఆధ్వర్యంలో పంచాయతీ పరిధిలోని లంక భవానియంలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంతకాల సేకరణ ని ప్రారంభించిన రమేష్ బాబు ముందుగా కాలనీవాసులతో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మెడికల్ కాలేజీల పిపిపి విధానాన్ని వ్యతిరేకించాలని కోరారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పట్ల సీఎం చంద్రబాబు నాయుడు చూపుతున్న కక్ష ప్రజలకు శాపంగా మారిందని, జగన్ ప్రభుత్వ కాలంలో ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు, ముఖ్యంగా మెడికల్ కాలేజీల స్థాపన జరిగిందని, కానీ ఇప్పుడు ఆ కళాశాలలను ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి ఇచ్చి పేదల వైద్య హక్కులను దెబ్బతీస్తున్నారని విమర్శించారు. అందువల్ల ఈ ప్రైవేటీకరణను నిలిపివేస్తే మన దేశంలో రాష్ట్రంలో అందరికీ వైద్య విద్య అందుబాటులోకి వస్తుందని, ప్రజలందరూ పార్టీలకు అతీతంగా ఈ కోటి సంతకాల సేకరణలో పాల్గొని, ప్రజా ప్రయోజనాల రక్షణలో భాగస్వాములు కావాలని రమేష్ బాబు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తుంగల సుమతి దేవి, జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ, వైఎస్ఆర్సిపి పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షులు సింహాద్రి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీలు తోట గణేష్, వర్రే నరేష్, మండల పార్టీ అధ్యక్షులు రేపల్లె శ్రీనివాసరావు, పులిగడ్డ గ్రామ సర్పంచ్ దాసరి విజయ్ కుమార్, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు చింతలపూడి బాల భాస్కరరావు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-కంకిపాడు** : మెడికల్ కాలేజీల ప్రైవేటీ కరణకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమనికి సంబందించిన ర్యాలీ పోస్టర్‌ను కంకిపాడులోని వైసిపి కార్యాలయంలో పెనమలూరు నియోజకవర్గం సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి, నియోజకవర్గ పరిశీలకులు అవుతు శ్రీనివాస రెడ్డిలు ఆవిష్కరించారు. ముందుగా వైసిపి స్టేట్ పబ్లిసిటీ విభాగం నాయకులు, పోరంకి గ్రామనికి చెందిన ప్రతివాడ రాఘవరావు (చిన్నారి) పుట్టినరోజు సందర్భంగా కేక్ కటింగ్ చేశారు. అనంతరం చక్రవర్తి మాట్లాడుతూ ఈనెల 28న నియోజకవర్గ హెడ్ క్వార్టర్స్ నుండి ప్రజా ఉద్యమం ర్యాలీ నిర్వహిస్తామని, దానిని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-మొవ్వ** : ప్రభుత్వ వైద్య కళాశాలలు ప్రైవేటీ కరణకు వ్యతిరేకంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కోటి సంతకాల సేకరణలో భాగంగా శనివారం మండల పరిధిలోని కూచిపూడి గ్రామంలో కూచిపూడి సర్పంచ్ భర్త కొండవీటి అమర బాలేశ్వర రావు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాజులపాటి రాఘవరావు ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొవ్వ మండలం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజులపాటి రాఘవరావు, డాక్టర్ విష్ణువర్ధన్ రావు, ఎంపీటీసీ భర్త వెలగం శ్రీనివాసరావు, కాటూరి శ్రీనివాసరావు, లంకపల్లి సుబ్రహ్మణ్యం, బండి సహదేవుడు, కైలా రాంబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మండలి బుద్ధప్రసాద్

గెలుపే ధ్యేయంగా పనిచేయాలి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-అవనిగడ్డ : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపే ధ్యేయంగా పనిచేసేందుకు సిద్ధం కావాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం అవనిగడ్డ గాంధీ క్షేత్రంలో నియోజకవర్గ జనసేన పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రాం, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మత్తి వెంకటేశ్వరరావు, ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాల్, పార్టీ సీనియర్ నాయకులు బచ్చు వెంకట్నాథ్ ప్రసాద్, మత్స్యకార విభాగం రాష్ట్ర కార్యదర్శి లంకె యుగంధర్, ఘంటసాల ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ పాల్గొన్నారు.

నాడు-నేడు నిధుల దుర్వినియోగంపై విచారణ జరపాలి



ప్రజాశక్తి-మోపిదేవి : మోపిదేవిలోని బిసి మత్స్యకారుల ఆశ్రమ పాఠశాలలో నాడు-నేడు నిధులు దుర్వి నియో గానికి సంబం ధించి విచారణ నిర్వహించి బాధ్యులైన ప్రధానో పాధ్యా యులపై చర్యలు తీసుకోవాలని మత్స్యకారుల సంఘం ప్రతినిధులు , విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. దక్షిణ భారతదేశ అగ్ని, వన్ని కులక్షత్రీయ సంఘం ఉపాధ్యక్షులు కోలా బాలాజీ వర్మ, అగ్నికుల క్షత్రియలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పొనమాల నాగాంజ నేయులు విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి పాఠశాలలో జరిగిన నాడు-నేడు పనుల తీరును శనివారం పరిశీలించారు. పాఠశాలకు సుమారుగా రూ51 లక్షలు నిధులు మంజూరు కాగా వాటిలో చేసిన పనులు లోపభూయిష్టంగా ఉన్నాయన్నారు. పనులు ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణ లేకుండా బదిలీపై వెళ్లిన ప్రధానోపాధ్యాయులు దుర్గా సాగర్ ఇష్టానుసారం చేశారని ఆరోపించారు. 26 లక్షల రూపాయలకు పైగా నిధులు డ్రా చేసినట్లు ఉండగా కేవలం 12 లక్షల రూపాయల వరకు మాత్రమే పనులు జరిగినట్లు ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నట్లు వారు తెలిపారు. పనులు చేసినట్లు డ్రా చేసిన 14 లక్షలు పనులు చేయకుండానే సంవత్సరకాలం కాలయాపన చేసి ప్రస్తుతం బదిలీపై వెళ్లిపోయినప్పటికీ సంబంధించిన శాఖ అధికారులు పట్టించుకోకపోవడంపట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. నిధులు దుర్వినియోగం చేసిన ప్రధానోపాధ్యాయులపై తక్షణమే ఉన్నతాధికారులు విచారణ నిర్వహించి శాఖ పరిమైన చర్యలు తీసుకోవడంతోపాటు నిధులను రికవరీ చేసేలా తగు చర్యలు తీసుకోవాలంటూ వారు డిమాండ్ చేశారు .



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న మంత్రి కొల్లు, తదితరులు

పాండురంగ స్వామి ఉత్సవాలను వైభవంగా నిర్వహించాలి : మంత్రి

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : చిలకలపూడి పాండురంగ స్వామి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని మంత్రి కొల్లు రవీంద్ర సూచించారు. శనివారం స్థానిక ఆర్ అండ్ బీ అతిథి గహంలో జరిగిన సమావేశంలో ఉత్సవాల ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో, నాయకులతో చర్చించారు. ఈ నెల 31వ తేదీ నుంచి నవంబర్ 5వ తేదీ వరకు జరిగే పాండురంగ స్వామి ఉత్సవాలను వైభవంగా, అన్ని సౌకర్యాలతో నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. అనంతరం మంత్రి కొల్లు రవీంద్ర పాండురంగ స్వామి ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో డిసిఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, టిడిపి సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపిచంద్, గోల్డ్ ప్రిన్స్ అధినేత చలమలశెట్టి నరసింహారావు, మచిలీపట్నం అర్బన్ బ్యాంకు చైర్మన్ ఐ. దిలీప్ కుమార్, టిడిపి నాయకులు పల్లపాటి సుబ్రమణ్యం, పంచవర్ణాల కాశీవిశ్వనాథం, పిప్పళ్ళ వెంకన్న, మార్కెట్ యార్డు చైర్మన్ కుంచే నాని, కమిషనర్ బాపిరాజు, ఆలయ ప్రధాన అర్చకుడు నరసింహం పాల్గొన్నారు.



విరాళాల వెల్లువ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరు శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి, శ్రీ గంగానమ్మ దేవస్థానాల జీర్ణోద్ధరణ పనులకు పలువురు దాతల నుంచి విరాళాలు శనివారం వెల్లువెత్తాయి. వల్లభనేని సుబ్బా రావు, జానకమ్మ మనవళ్లు, మనవరాళ్లు రూ.50వేలు, కోగంటి లక్ష్మీనారాయణ రూ.5,116, కంచర్ల రామదాసు, రత్న మాణిక్యమ్మ దంపతుల స్మారకార్థం మనవడు రూ.25,116, శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణకుమార్ రూ.10,116, బుర్రా నారాయణమూర్తి, సీతామహాలక్ష్మి దంపతుల జ్ఞాపకార్థం రూ.10,116, ఉద్దగిరి నాగేశ్వరరావు స్మారకార్థం కుమారుడు వెంకటేశ్వరరావు రూ.10,116, పరసా లీలా మాధవ్ జ్ఞాపకార్థం కుమారుడు రాజేంద్రప్రసాద్ రూ.10,116 విరాళాల్ని అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఈఆర్ఎమ్ విద్యా సంస్థల చైర్మన్ వల్లభనేని వెంకట్రావు, మాజీ జెడ్పీటీసీలు కొసరాజు బాపయ్యచౌదరి, జంగం మోహనరావు, నెహ్రూ పశువుల సంత కమిటీ చైర్మన్ వల్లభనేని సుబ్బారావు, కార్యదర్శి ఈడ్పుగంటి ఉమా, డైరెక్టర్ వల్లభనేని బుడ్డిబాబు పాల్గొన్నారు.


తహశీల్దార్ కార్యాలయంలో నిరుపయోగంగా జనరేటర్, బోర్‌వెల్

- అధికారుల నిర్లక్ష్యంపై మండిపాటు

ప్రజాశక్తి-ఉంగుటూరు : ప్రభుత్వం అందించిన వనరులు సరియైన నిర్వహణ లేక మూలన పడి శిధిలమవుతుంటే, క్షేత్రస్థాయిలో వాటిని పరిరక్షిం చాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరి స్తున్నారని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రమైన ఉంగుటూరు తహసిల్దార్ కార్యాలయంలో నీటి తొట్టి, బోర్వెల్, జనరేటర్‌లను సరిగ్గా వినియోగించ కపోవడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తహసిల్దార్ కార్యాలయ ప్రాంగణం పల్లంగా ఉండటం వలన స్వల్ప వర్షం పడినా నీరు చేరి, రోజుల తరబడి అక్కడే నిల్వ ఉండిపోతుంది. ఇది దోమల ఉత్పత్తి కేంద్రంగా మారడమే కాకుండా, వివిధ గ్రామాల నుండి వచ్చే ప్రజలు మురుగు నీటిలో నడవవలసిన దుస్థితిని సష్టించింది. ఈ పరిస్థితి గత కొన్ని సంవత్సరాలుగా మార్పు లేకుండా కొనసాగుతోంది. కార్యాలయ అవసరానికి నీరు అందించే బోర్వెల్ ఇప్పుడు ఈ నిల్వ నీటిలోనే మునిగి ఉంది. వర్షపు నీటి నుండి బోర్ వెల్ ను కాపాడడం కోసం కానీ లేదా దాన్ని సురక్షితమైన స్థలానికి మార్చే ఎటువంటి చర్యలు అధికారులు తీసుకోవడం లేదు. ఇది ప్రాథమిక స్థాయి నిర్వహణ లోపాన్ని సూచిస్తోంది. తహసీల్దార్ కార్యాలయంలో ఏ పని చేయాలి అన్నా ఆన్లైన్‌లోనే చేయాలి దానికి ఏ విధమైన ఆటంకం కలగకూడదు అని ఆన్లైన్ పనులను దృష్టిలో ఉంచుకుని, విద్యుత్ కోత సమయంలో కార్యాలయం నిర్వహణ కొనసాగించేందుకు ప్రభుత్వం కొన్ని సంవత్సరాల క్రితం జనరేటర్ను కార్యాలయానికి మంజూరు చేసింది. కానీ దాని రక్షణ, నిర్వహణపై ఎటువంటి శ్రద్ధ చూపబడలేదు. ఆ జనరేటర్ కార్యాలయం వెనుక భాగంలోనే ఉంచారు. ఎండకు ఎండడం, వానకు తడవడం వల్ల బాగా తుప్పు పట్టి ఇప్పుడు శిధిలావస్థలో ఉంది. అధికారుల బదిలీల కారణంగా, ప్రస్తుతం పదవిలో ఉన్న తహసీల్దార్‌కు కూడా తమ కార్యాలయానికి జనరేటర్ ఉందనే విషయం తెలియకపోవచ్చనే వాదనలు ఉన్నాయి. కార్యాలయంలో ఉన్న ఈ వనరులు బోర్వెల్, జనరేటర్ బాగుచేయించి వాటిని వినియోగంలోకి తీసుకురావాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



మురుగునీటిలో ఉన్న బోర్‌వెల్



నిరుపయోగంగా ఉన్న జనరేటర్

డిఎంహెచ్‌ఒను కలిసిన ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ నాయకులు



ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : కృష్ణా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ పి.యుగంధర్ ను కష్ణాజిల్లా ఏపీ ఎన్ జీ వోస్ అసోసియేషన్ నాయకులు శనివారం వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలసి అభినందనలు తెలిపారు. అభినందలు తెలిపిన వారిలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఆకూరి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి వెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు కే సురేష్ బాబు, పట్టణ ఉపాధ్యక్షులు శ్రీధర్ బాబు, నాగభూషణం మరియు కంకిపాడు యూనిట్ అధ్యక్షులు వెంకటేశ్వరరావు, బుచ్చిబాబు, ప్రసాద్ లు ఉన్నారు.

ప్రకృతి వైపరీత్యాలకు అన్నదాత విలవిల

'ప్రకృతి వైపరీత్యాలు అన్నదాతలను కుంగదీస్తున్నాయి. అకాల వర్షాలు, బంగాళాఖాతంలో ఏర్పడుతున్న అల్పపీడనాలు, తుఫానుల ప్రభావంతో కురిస్తున్న భారీ వర్షాల దెబ్బకు రైతులు విలవిలలాడుతున్నారు. పంటల దిగుబడులు తగ్గి పంటల సాగుకు పెట్టిన పెట్టుబడులు చేతికి రాక అన్నదాతులు అప్పులపాలవుతున్నారు.

ఈ ఏడాది మే నెలలో కురిసిన అకాల వర్షాలకు 64.33 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. రూ.19.90 లక్షలు పరిహారం అందాల్సి ఉంది. సెప్టెంబర్‌లో కృష్ణానదికి వచ్చిన వరదలకు తీరంలోని 2,244 హెక్టార్లలో పంటలు కొట్టుకుపోయాయి. 2,863 మంది రైతులకు నష్టం వాటిల్లింది. కృష్ణాతీరంలో కంద, పసుపు, అరటి, తమలపాకు తదితర పంటలు అధిక విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. ఎకరాకు రూ.లక్షకుపైగా పెట్టినపెట్టుబడిలో చిల్లిగవ్వ చేతికి తిరిగి వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. ఈ ఏడాది ఒక్కసారి మాత్రమే కాదు.. గత నాలుగేళ్లగా వరుసగా కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలోని పంటలను వరదలు ముంచెత్తుతున్నాయి. ప్రభుత్వాలు ప్రకటించే అరకొరసాయం నష్టపోయిన రైతులకు కనీస ఊరట ఇవ్వడం లేదు. పరివాహక ప్రాంతంలో పంటలు సాగు చేసిన రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. అక్టోబర్ మూడో వారంలో బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం కారణంగా ఐదు రోజులు కురిసిన 107 మిల్లీ మీటర్ల వర్షాలకు 33 గ్రామాల్లో 379 మంది రైతులకు సంబంధించిన 228.4



హెక్టార్లలో వరి పంట నేలవాలింది. మొంథా తుపాను ప్రభావం జిల్లాపై అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించడం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. ఈ తుపాను మచిలీపట్నం, కళింగపట్నం, కాకినాడ ప్రాంతాల్లో తీరందాటే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణశాఖ సూచిస్తోంది. తీరందాటే సమయంలో ఈదురుగాలులు వీస్తాయని, భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించడంతో పాఠశాలలకు మూడు రోజులు సెలవు ప్రకటించారు. ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో అత్యధిక 1,56,901 హెక్టార్ల విస్తీర్ణంలో వరి సాగు చేశారు. కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే పంటకోతకు వచ్చింది. మరికొన్ని ప్రాంతాల్లో చిరు పొట్ట, బిర్రు పొట్ట, గింజ పాలు పోసుకునే దశల్లో వరి పైరు ఉంది. వరి పొట్ట, కంకి పాలు పోసుకునే దశల్లో వాతావరణంలో వర్షాలు తక్కువగా ఉంటే ధాన్యం దిగుబడులు రైతు ఆశించిన మేరకు 75 కిలోలు బస్తాలు ఎకరాకు 35 నుంచి 40 వరకు దిగుబడి వస్తుంది. ఈ పరిస్థితుల్లో తాజాగా తుఫాను ప్రభావంతో భారీ వర్షాలు, గాలులు వీస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించడం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. ఈత, పాలు పోసుకునే దశలో అధిక వర్షాలు కురవడంతో తప్ప, తాలు గింజ ఎక్కువగా వచ్చి దిగుబడులు తగ్గుతాయని రైతులు, వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు. దీనికి తోడు తాజా తుఫానుకు భారీ గాలుల వీస్తే పైరు నేలవాలి దిగుబడులు మరింత తగ్గడంతో పాటు గింజ నాణ్యత దెబ్బతింటుందని అంటున్నారు. వరి విత్తనాలు కొనుగోలు, నారు మళ్ల పెంచడం, నాటు వేయడం, ఎరువులు, పురుగుమందులు, నూర్పిడిలకు ఎకరాకు 35 వేల వరకు పెట్టుబడి వ్యయం అవుతోంది. ప్రస్తుత పరిస్థితుల్లో పెట్టిన పెట్టుబడులు చేతికి వస్తాయా? లేక అప్పులు మిగులుతాయో తెలవక రైతులు ఆందోళన చెందుతున్నారు.

డిఎస్ఆర్‌వి ప్రసాద్

కళా ఉత్సవ్‌లో జానెట్ విద్యార్థుల ప్రతిభ



ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం: భారత ప్రభుత్వం నిర్వహించిన కళా ఉత్సవ్ 2025-2026 కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మండలం కేతనకొండ గ్రామానికి చెందిన జానెట్ పాఠశాలలోని 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు నక్క వెంకట సునీత, మన్నెం గీతిక ప్రతిభ కనపరిచారు. సెప్టెంబర్ 11న అంగలూరు డైట్ కాలేజీలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలలో ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. గురువారం పోరంకి మురళి రిసార్ట్స్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీలలో తృతీయ స్థానం సాధించి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు పాఠశాల చైర్మన్ ఇమ్మానియల్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు స్వాతి, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

టేబుల్ టెన్నిస్‌లో దాముస్ అకాడమీ క్రీడాకారులకు పతకాలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఏలూరులో అక్టోబర్ 24న జరిగిన యుటిటి ఏపీ స్టేట్ ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ టోర్నీలో దాముస్ టీటీ అకాడమీ క్రీడాకారులు పలు పతకాలు సాధించినట్లు అకాడమీ కోచ్ వై.దామోదర్ రెడ్డి తెలిపారు.



బాలుర అండర్ 15 విభాగంలో జి.లోహిత్ రజత పతకం, బాలుర అండర్ 13 విభాగంలో యశ్వంత్ రజత పతకం, బాలికల అండర్ 11 విభాగంలో జి.మహి మన్విక రజత పతకం, జి.మిషిక కాంస్య పతకం కైవసం చేసుకున్నారు. వీరు పటమటలోని చెన్నుపాటి రామకోటయ్య నగర పాలక సంస్థ ఇండోర్ స్టేడియంలో శిక్షణ పొందుతున్నారు. ఈ సందర్భంగా విజేతలను కృష్ణాజిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్సులు ఈ.రామిరెడ్డి, వి.భార్గవి, కోశాధికారి ఎ.రామచంద్రరావు, వీఎంసీ స్పోర్ట్స్ డైరెక్టర్ డా.ఎ.శ్రీధర్, శిక్షకులు స్వపన్ గంగోపాధ్యాయ, తదితరులు అభినందనలు తెలిపారు.



దీక్షలు విరమించిన లారీ ఓనర్లు, డ్రైవర్లు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం: బూడిద టెండర్ రద్దు చేయాలని 37 రోజులుగా రిలే దీక్షలు చేస్తున్న లోకల్ లారీ ఓనర్లు, డ్రైవర్లు శనివారం దీక్షలు విరమించారు. మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ దీక్షలను విరమింప చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్‌టిటి పిఎస్ యాజమాన్యం బూడిద తరలించే విషయంలో టెండర్లు పిలిచిన కారణంగా స్తబ్దత ఏర్పడి లోకల్ ట్రాన్స్ పోర్టర్‌లు సమ్మె చేస్తున్నారన్నారు. దీనిపై అసెంబ్లీలో మాట్లాడి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. లారీ ఓనర్ల న్యాయమైన డిమాండ్లను దృష్టిలో ఉంచుకొని వారి పోరాటానికి ప్రత్యక్షంగా అండగా నిలిచినట్లు వెల్లడించారు. దీనిపై స్థానిక లారీ ఓనర్లు ఉపాధి కోల్పోతున్న సమస్యను వివరించగా, ఎన్‌టిటిపిఎస్ కాలుష్య ప్రభావిత గ్రామాల్లోని లారీలకు ప్రతి వారం 3 లారీల చొప్పున ఉచితంగా లోడింగ్ చేసేందుకు ఒప్పందం జరిగిందన్నారు. లోకల్ వారికి నెలకు 12 లారీల చొప్పున ఉచితంగా బూడిద ఇస్తామని కాంట్రాక్టు సంస్థ ఇచ్చిన హామీ మేరకు దీక్ష విరమింపజేసినట్లు వెల్లడించారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే వాటి పరిష్కారానికి కూడా కషి చేస్తానని పేర్కొన్నారు. సమస్య పరిష్కారం కోసం కషి చేసిన ఎంపీ కేశినేని చిన్ని కి, ఎమ్మెల్యే వసంత కష్ణప్రసాద్ కు లోకల్ లారీ ఓనర్లు, డ్రైవర్లు కతజ్ఞతలు తెలియజేశారు. మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), నేతలు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆల్ రౌండర్లుగా ఎదగాలి

- ముఖ్యమంత్రి కార్యదర్శి కార్తికేయ మిశ్రా



ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాలపై ఆసక్తి పెంచుకొని ఆల్ రౌండర్లుగా ఎదగాలని ముఖ్యమంత్రి కార్యదర్శి (చీఫ్ మినిస్టర్ సెక్రటరీ) కార్తికేయ మిశ్రా అన్నారు. నగరంలోని బ్లూమింగ్ డేల్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో గత రెండు రోజులుగా జరుగుతున్న ఎక్స్పో టెన్షియల్ విజ్ఞాన ప్రదర్శన ముగింపు కార్యక్రమం శనివారం సాయంత్రం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఎన్నో మార్పులు విద్యా రంగంలో వస్తున్నాయని, వాటికి అనుగుణంగా విద్యార్థులు ముందుకు వెళ్లాలని తెలిపారు. ప్రతి విద్యార్థి ప్రతి రోజు ఒక కొత్త ఆలోచనతో వినూత్నంగా ఉండాలని అన్నారు. ప్రస్తుత కాలంలో పుస్తకాలతో కూడిన విద్యా ఒక్కటే చాలదని, సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా మారాలని సూచించారు. ప్రతి విద్యార్థిలోనూ అద్భుత సృజనాత్మక శక్తి ఉంటుందని వాటిని వెలికి తీయడానికి విద్యా విజ్ఞాన ప్రదర్శనలు దోహదపడతాయని అన్నారు. బ్లూమింగ్ డేల్ ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ విజయ బాబు అట్లూరి మాట్లాడుతూ తమ విద్యార్థులకు చదువుతో పాటు అన్ని రంగాలపై ఆసక్తి కలిగించే విధంగా వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని అన్నారు. విద్యార్థులు స్వయంగా తయారుచేసిన వివిధ నమూనాలతో కూడిన సైన్స్ ప్రదర్శనలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 60 మంది విద్యార్థులు రోబో, ఎయిర్ టాక్సీ, పర్యావరణ పరిరక్షణ కు ఉపయోగపడే విధంగా నమూనాలు, మొత్తం 60 ప్రదర్శనలు ఏర్పాటు చేశారని అన్నారు. రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ ప్రదర్శన విద్యార్థులతో పాటు,తల్లి దండ్రులు, నగర పార్మికులు సందర్శించి విద్యార్థుల ప్రతిభను ప్రశంసించారని అన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ హరి సిమ్రాన్ కౌర్. కపాని, స్కూల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పద్మ లత, ఎస్ ఆర్ ఎం యూనివర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ శివ శంకర్, కెఎల్ యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ నదీమ్, విద్యార్థులు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి



ప్రజాశక్తి-విజయవాడ : లోతట్టు ప్రాంత ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలిరావాలని, అధికారులు మొంథా తూఫాన్ సందర్భంగా అప్రమత్తంగా ఉండాలని విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. విజయవాడ రెవెన్యూ, విఎంసి శాఖధిపతులు, సిబ్బందితో శనివారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. అధికారులు సమన్వయంతో పని చేయాలని, వెలగలేరు, ప్రకాశం బ్యారేజ్ వద్ద అప్రమత్తంగా ఉండాలని, బుడమేరు, కృష్ణానది నీటి మట్టం నివేదిక అందజేయాలని అన్నారు. విఎంసి సభంధిత సమస్యలు తెలిచేయడానికి 24/7 కంట్రోల్ రూము ఏర్పాటు చెయ్యాలని ఆదేశించారు. పునరావాస కేంద్రాలు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచాలన్నారు. కొండప్రాంతాలలో, లోతట్టు ప్రాంతాలలో నివసిస్తున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. అసురక్షితమైన హోర్డింగులు, ఫ్లెక్సీలు తొలగించాలని అన్నారు. ప్రమాదకరమైన వృక్షలను ఉద్యానవనం శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాటి నివేదికను సమర్పించాలని తెలిపారు.

ఎరువుల దుకాణ యజమానులకు జరిమానా

ప్రజాశక్తి-విజయవాడ

ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ శనివారం పౌర సరఫరాల శాఖకు సంబంధించిన 6ఏ కేసులపై కోర్టు నిర్వహించారు. కేసులు నమోదైన వ్యక్తులను, కేసులు నమోదు చేసిన అధికారులను విచారించి ఎరువుల నిల్వల విషయంలో అవకతవకలకు పాల్పడిన ఎరువుల దుకాణ యజమానులకు రూ.1,03,000 జరిమానా విధించారు. అదేవిధంగా 35.60 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని ప్రభుత్వం పరం చేసేందుకు ఉత్తర్వులు జారీచేశారు. పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేసేందుకు ఉపయోగించిన వాహన యజమానికి రూ. 25,000 జరిమానా విధించారు.

మాకు న్యాయం చేయండి

- జెసిని కోరిన విజయవాడ అంపాపురం ఓపెన్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి : 'లక్షలు వ్యయం చేసి కొని రిజిస్ట్రేషన్ చేయించుకున్న మా ఇళ్ల స్థలాలకు రక్షణ కల్పించాలి. మా స్థలాలను వ్యవసాయ భూమిగా చూపుతూ మరొకవ్యక్తికి మంజూరు చేసిన పట్టాదారు పాస్‌బుక్‌ను వెంటనే రద్దు చేసి మాకు న్యాయం చేయాలి' అని విజయవాడ పారడైజ్ అంపాపురం ఓపెన్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధికారులను కోరింది. శనివారం మచిలీపట్నం కలెక్టరేట్‌లోని జెసి ఎం.నవీన్‌ను అసోసియేషన్ సభ్యులు కలిసి సమస్యను వివరించారు. బాపులపాడు మండలం అంపాపురంలో నాళాకన్వర్షన్ పూర్తయిన వివిఆర్ హౌసింగ్ ఎస్టేట్ వెంచర్ 31.75 ఎకరాల్లో 400 మంది ప్లాట్లు కొనుగోలు చేసినట్లు తెలిపారు. సర్వే నంబర్ 201/4, 203/1, 213/2, 210/2 సర్వే నంబర్‌లలోని 6.75 ఎకరాలను వ్యవసాయ భూమిగా చూపుతూ ప్లాట్లతో సంబంధం లేని వ్యక్తికి పట్టాదారుపాస్‌బుక్ మంజూరు



చేశారని తెలిపారు. అక్రమ పాస్‌బుక్‌ను రద్దు చేయాలని కోరారు. అసోసియేషన్ సభ్యులు చూపిన వివరాలను పరిశీలించిన జెసి ఈ భూములకు మంజూరు చేసిన పట్టాదారు పాస్‌బుక్ రద్దు చేస్తామని సభ్యులకు తెలిపారు. ఈ సందర్భంగా 'మా భూమి మా హక్కు' ప్లాట్లుగా మారిన భూముల్లో వ్యవసాయ చేయడం నిషేదం, నాలా కన్వర్షన్ ఫర్ హౌసింగ్ సొసైటీ, అని సొసైటీ సభ్యులు ప్లకార్డులు ప్రదర్శించారు. అసోసియేషన్ అధ్యక్షులు అబ్దుల్లా, హైదరాబాద్‌కు చెందిన సభ్యులు వి.గిరిజ, చెన్నైకు చెందిన జానం మోహనరంగారావు, రిటైర్డు ఆర్మీ పి.నాగభూషణం, తెనాలి, గన్నవరం, విజయవాడ, బెంగుళూరు, గిద్దలూరు తదితర ప్రాంతాల నుంచి 60 మందికి పైగా అసోసియేషన్ సభ్యులు జెసిని కలిసి సమస్య వివరించారు.